# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్ 10.06.2025 | 24 క్యారెట్లు 92,215.00 | కిలో వెండి 1,07,99800 | 32 °C | సంపుటి:3 | సంచిక:221

www.vishalabharati.com


## 11 ఏళ్లుగా సామాజిక ఉన్నతే లక్ష్యంగా పాలిస్తున్నాం

- వికసిత్ భారత్ లక్ష్య సాధన దిశగా ప్రయాణం
- దేశాన్ని ప్రతి రంగంలోనూ నంబర్-1గా మార్చేప్రయత్నం
- ఉగ్ర దాడులను యుద్ధంగానే భావిస్తాం
- జాతీయ భద్రతకు ప్రథమ ప్రాధాన్యం
- ఎన్డీఏ 11 ఏళ్ల పాలన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఎన్డీఏ 11 ఏళ్ల పాలనలో భారతదేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా అవతరించిందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. వాతావరణ మార్పులు, డిజిటల్ ఇన్నోవేషన్ వంటి రంగాల్లో ప్రపంచ గళంగానూ మారిందని పేర్కొన్నారు.తన నేతృత్వంలోని మూడోవిడత ఎన్డీఏ ప్రభుత్వం ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా తన

..మిగతా 2 లో




## శుభాన్షు శుక్లా అంతరిక్ష యాత్ర వాయిదా

- ప్రతికూల వాతావరణమే కారణం
- ఇస్రో ఛైర్మన్ నారాయణన్ వెల్లడి
- 1984లో రష్యాకు చెందిన సోయజ్ రాకెట్ ద్వారా రోదసియానం
- ఆ తర్వాత భారత పౌరుడొకరు అంతరిక్షంలోకి వెళ్లడం ఇదే తొలిసారి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ప్రతికూల వాతావరణం కారణంగా భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా రోదసియాత్ర జూన్ 11(బుధవారం)కు వాయిదా పడింది. మంగళవారం సాయంత్రం 5 గంటల 52 నిమిషాలకు జరగాల్సిన స్పేస్ ఎక్స్ డ్రాగన్ వ్యోమనౌక ప్రయోగం బుధవారానికి వాయిదా పడినట్టు ఎక్స్ మాధ్యమంలో ఇస్రో తెలిపింది. భారత కాలమానం ప్రకారం బుధవారం సాయంత్రం ఐదున్నర గంటలకు ప్రయోగం జరగనుందని ఎక్స్ మాధ్యమంలో ఇస్రో ఛైర్మన్ V. నారాయణన్ వెల్లడించారు. మంగళవారం నిర్వహించాల్సిన ప్రయోగం ఒకవేళ వాయిదా పడితే, ఈ నెల 11న సాయంత్రం 5.30 గంటలకు (భారత కాలమానం ప్రకారం) మరో అవకాశం ఉన్నట్లు స్పేస్ఎక్స్

..మిగతా 2 లో

# కాళేశ్వరం ఎప్పటికైనా తెలంగాణకు జీవధారే

## కమిషన్ ముందు ఏదీ నోటి మాటగా చెప్పలేదు



- అన్నీ సాక్ష్యాధారాలతో సహా సమర్పించాను
- కాళేశ్వరం కమిషన్ ఎదుట హరీష్ రావు విచారణ
- 40 నిమిషాల పాటు సాగిన విచారణ
- వాస్తవాలు చెబుతానని దైవసాక్షిగా మాజీ మంత్రిప్రమాణం
- ఓపెన్ కోర్టులో పీసీ గోష్ కమీషన్ విచారణ
- ప్రాజెక్టు రీ డిజైన్, కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటుపై ప్రశ్నలు
- తుమ్మడి హట్టి నుంచి మేడిగడ్డకు ఎందుకు మార్చారు..
- కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటుకు కారణం ఏంటి?
- మహారాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరాలు
- ఎక్స్‌పర్ట్ కమిటీ సూచనలతో మార్చాల్సివచ్చిందన్న హరీష్

> *"కాళేశ్వరం ఎప్పటికైనా తెలంగాణకు జీవధార.. ఈ విషయం తెలంగాణ ప్రజలకు అర్థమైంది అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. కాళేశ్వరం కమిషన్ ముందు ఏదీ నోటి మాటగా చెప్పలేదు. అన్నీ సాక్ష్యాధారాలతో సహా సమర్పించడం జరిగిందని స్పష్టం చేశారు. క్యాబినెట్ నిర్ణయాలు, వాప్కోస్ రిపోర్టులు, సీడబ్ల్యూసీ లేఖలు అన్నీ సమర్పించడం జరిగిందని హరీశ్‌రావు తెలిపారు. కాళేశ్వరం కమిషన్ విచారణ ముగిసిన అనంతరం బీఆర్కే భవన్ వద్ద హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు.*

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కాళేశ్వరం కమిషన్ ఎదుట మాజీ మంత్రి హరీష్‌రావు విచారణ ముగిసింది. దాదాపు 40 నిమిషాల పాటు విచారణ జరిగింది. వాస్తవాలు చెబుతానని దైవసాక్షిగా మాజీ మంత్రి ప్రమాణం చేశారు. హరీష్‌రావును ఓపెన్ కోర్టులో పీసీ గోష్ కమీషన్ విచారించింది. ప్రాజెక్టు రీ డిజైన్, కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటు, కేబినెట్ అనుమతులపై హరీష్‌రావును కమిషన్ ప్రశ్నించింది. తుమ్మిడి హట్టి వద్ద చేవెళ్లప్రాణహిత ప్రాజెక్ట్‌కు డిజైన్ చేసి ఎందుకు మార్చాల్సి వచ్చిందని కమిషన్ ప్రశ్నించింది. దానికి సుదీర్ఘమైన వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు మాజీ మంత్రి. తుమ్మిడి హట్టి వద్ద ప్రాజెక్ట్‌ను నిర్మించాలని ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, అందుకు సంబంధించిన డిజైన్‌ను తయారు చేసి పనులను కూడా ప్రారంభించిందని తెలిపారు. అయితే పనులను ప్రారంభించిన సమయంలో ఆనాడు మహారాష్ట్రలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అభ్యంతరాలు చెప్పిందని, ఆ సమయంలో మహారాష్ట్రలోనూ, తెలంగాణలోనూ, సెంట్రల్‌లో కూడా కాంగ్రెస్ సర్కారే ఉందన్నారు. కానీ అంతర్రాష్ట్ర ఒప్పందాలు కుదుర్చుకోవడంలో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు.దాంతో తెలంగాణ ఏర్పాడ్డాక రాష్ట్రానికి నీళ్లు రావాడం కోసం ప్రాజెక్ట్ నిర్మాణానికి మహారాష్ట్ర అభ్యంతరాలు చెప్పడంతో ముందుకు వెళ్లే సాధ్యం కాని పరిస్థితుల్లో పెండింగ్‌లో ఉన్న ప్రాణహిత ప్రాజెక్ట్‌పై నిర్ణయం కోసం కమిటీని ఏర్పాటు చేసినట్లు కమిషన్‌కు తెలిపారు మాజీ మంత్రి. ఆ ప్రాంతంలో ప్రాజెక్ట్ సాధ్యం కాదని కమిటీ నివేదిక ఇచ్చిందని, అలాగే నీటి లభ్యత లేదని సీడబ్ల్యూసీ కూడా నివేదిక ఇచ్చిందని, అలాగే ఎక్స్‌పర్ట్ కమిటీ

..మిగతా 3 లో



## కొత్త మంత్రులకు శాఖల కేటాయింపుపై కసరత్తు

- అధిష్టానంతో సీఎం రేవంత్ రెడ్డి సంప్రదింపులు
- కొత్త మంత్రులకు శాఖలు కేటాయింపుపై పార్టీలో విస్తృతంగా చర్చ
- మంత్రులశాఖల మార్పులు, చేర్పులు కూడా జరగవచ్చనే ప్రచారం
- ఏఐసీసీ తుదినిర్ణయం తర్వాతే...
- మంత్రివర్గ విస్తరణతో 15కు మంత్రుల సంఖ్య

2 లో

### ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ ఐఈడీ పేలుడులో ఏఎస్పీ మృతి

- డీఎస్పీ, సీఐ సహా కొందరు కానిస్టేబుళ్లకు తీవ్ర గాయాలు
- నేడు బస్తర్‌లో మావోయిస్టులు బంద్‌కు పిలుపు

3 లో




## SITHA యాప్ మహిళ సాధికారతకు ఒక కొత్త దిశ

- దేశంలోనే మోడల్‌గా నిలుస్తోంది
- మహిళలు అన్ని రంగాల్లోకి రావాలి
- గ్రామీణ మహిళలకు ఈ యాప్ మార్గదర్శిగా తీసుకోవాలి
- రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళలకు అనేక అవకాశాలు
- ఐటి మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- సామాజిక, ఆర్థికంగా మహిళలు ఎదగాలి
- పీసీసీ వైస్ ప్రెసిడెంట్ పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ ఝాన్సి రెడ్డి

..మిగతా 2 లో

## మావోయిస్టు మైలారపు అడెల్లు అంత్యక్రియలు

- ఈ నెల 6న బీజాపూర్ ఎన్‌కౌంటర్‌లో మృతి
- అనేకసార్లు తప్పించుకున్న అడెల్లు
- ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక బహుజనులు మృతి
- మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలి
- నివాళులర్పించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

3 లో

## మోదీ 11ఏళ్ల పాలనలో ప్రజాస్వామ్యం దెబ్బతిన్నది

- రాజ్యాంగబద్ధమైన సంస్థలను బలహీనం చేసిండు
- ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా ప్రభుత్వాలను కూల్చేసిండు
- రాష్ట్రాల హక్కుల విస్మరణ..సమాఖ్య స్ఫూర్తి నిర్మాణం బలహీనం
- రాజ్యాంగంలోని ప్రతిపేజీలో నియంతృత్వ సిరాను పోసిండు
- మణిపూర్ లో సాగుతున్న హింస మోదీ పాలన వైఫల్యానికి అతిపెద్ద సాక్ష్యం
- కేంద్రంపై మండిపడ్డ కాంగ్రెస్ చీఫ్ ఖర్గే, రాహుల్ గాంధీ

..మిగతా 2 లో

## బస్‌పాస్ ఛార్జీలు పెంచిన ఆర్టీసీ

- 20శాతం నుంచి 24శాతం వరకు పెంపు
- సాధారణ ప్రజలతో పాటు, స్టూడెంట్ బస్‌పాస్ ధరలను పెంచిన ఆర్టీసీ
- నేటి నుంచి అమల్లోకి వచ్చిన కొత్త బస్‌పాస్ ఛార్జీలు
- ఆర్టీసీ టోల్ ఛార్జీలను 10 రూపాయలకు పెంచారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్ర వ్యాప్తంగా బస్ పాస్ ఛార్జీలను టీజీఎస్ఆర్టీసీ 20శాతం నుంచి 24శాతం వరకు పెంచింది. రూ.1,150 ఉన్న ఆర్డినరీ పాస్ రూ.1,400కు పెంచారు. రూ.1,300 ఉన్న మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్ పాస్ ధరను రూ.1,600కు పెంచారు. రూ.1,450 ఉన్న మెట్రో డీలక్స్ పాస్‌ను రూ.1,800కు పెంచారు. గ్రేటర్ హైదరాబాద్, గ్రీన్ మెట్రో ఏసీ బస్ పాస్ ధరలను ఆర్టీసీ పెంచింది. కొత్త ఛార్జీలు నేటి నుంచి అందుబాటులోకి వస్తాయని ఆర్టీసీ యాజమాన్యం




వెల్లడించింది. మూడేళ్లుగా బస్ పాస్ ఛార్జీలను పెంచలేదని, బస్సుల నిర్వహణ, డీజిల్ ధరలు పెరగడం, ఉద్యోగుల

..మిగతా 2 లో



## మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ లాభాలు

- ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- ఆర్టీసీ కార్మికుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**సూర్యాపేట, విశాలభారతి:**

మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ లాభాల బాటలో కొనసాగుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సోమవారం సూర్యాపేట బస్ డిపో నందు ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ల తో కలిసి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ ఆర్థిక శాఖ మంత్రి

..మిగతా 3 లో



## 11 ఏళ్లుగా సామాజిక ఉన్నతే లక్ష్యంగా పాలిస్తున్నాం

తరువాయి భాగం

అభిప్రాయాలను పంచుకున్నారు. సుపరిపాలన, పరివర్తనపై పూర్తిస్థాయిలో దృష్టిసారించామని ప్రధాని మోదీ అన్నారు. సామాజిక న్యాయానికి సైతం అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు గుర్తుచేసిన ప్రధాని మోదీ, తమ మంత్రి మండలిలో 60 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల వారే ఉన్నట్లు తెలిపారు. ఈ స్థాయిలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు మంత్రి పదవులు కేటాయించడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. ఎన్డీఏ 11 ఏళ్ల ప్రస్థానంలో ఆర్థిక వృద్ధి నుంచి సామాజిక అభ్యున్నతి వరకూ ప్రజల కేంద్రంగానే పాలన సాగించినట్లు మోదీ వివరించారు. వికసిత్ భారత్ లక్ష్య సాధన దిశగా తాము ముందుకుసాగుతున్నట్లు వెల్లడించారు. స్వర్ణ యుగం మోదీ ప్రభుత్వ 11 ఏళ్ల పాల ప్రజాసేవ పట్ల సంకల్పం, కృషి, అంకిత భావాలకు ఒక 'స్వర్ణయుగం' అని కేంద్ర హోంమంత్రి అమిత్షా పేర్కొన్నారు. ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ పాలనలో భారత్ అభివృద్ధి, స్వావలంలన వైపు వేగంగా పురోగమిస్తోందని ఆయన అన్నారు. దేశ ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడం ద్వారా భారతదేశాన్ని ప్రతి రంగంలోనూ నంబర్ 1గా మార్చే ప్రయాణం కొనసాగుతోందని ఆయన స్పష్టం చేశారు."నాయకత్వం స్పష్టంగా ఉన్నప్పుడు, సంకల్పం దృఢంగా ఉన్నప్పుడు, ప్రజాసేవ చేయాలనే ఉద్దేశం ఉన్నప్పుడు సేవ, భద్రత, సుపరిపాలనలో కొత్త రికార్డులు సృష్టించబడతాని మోదీ ప్రభుత్వం నిరూపించింది" అని అమిత్షా పేర్కొన్నారు. 2014లో ప్రధానిగా మోదీ దేశ పగ్గాలు చేపట్టినప్పుడు భారత్ విధానపరంగా అచేతనంగా ఉంది. గత ప్రభుత్వాలకు విధానాలు లేవు, నాయకత్వం లేదు. మోసాలు తారస్థాయికి చెరుకున్నాయి. ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయింది. పాలనా వ్యవస్థ దిశానిర్దేశం లేకుండా ఉండేది. కానీ గత 11 ఏళ్లలో 'కనీస ప్రభుత్వం, గరిష్ఠ పాలన' ద్వారా దేశ అభివృద్ధి వేగం, స్థాయి రెండూ మారాయి' అని అమిత్ షా అన్నారు. మోదీ రైతులు, మహిళలు, వెనుకబడినవారు, దళితులు, అణగారిన వర్గాలను పాలనలో భాగం చేశారు. బుజ్జగింపులకు బదులుగా సబ్కా సాత్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్, సబ్కా ప్రయాస్ అనే పని సంస్కృతిని సృష్టించారు' అని అమిత్ షా పేర్కొన్నారు. 'మోదీ జాతీయ భద్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నారు. దేశంలో నక్సలిజం చివరి దశలో ఉంది. జమ్మూకశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లో శాంతి నెలకొంది. భారత్ ఇప్పుడు ఉగ్రవాదుల స్థావరాల్లోకి చొరబడి వారిని అంతమొందిస్తోంది. ఇది మోదీ ప్రభుత్వ హయాంలో మారుతున్న భారత చిత్రాన్ని చూపిస్తోంది' అని అమిత్ షా అన్నారు.పేదల సంక్షేమం కోసం సుపరిపాలన, పేదల సంక్షేమం కోసం ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం చేసిన కృషి చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించపడుతుందని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్, వక్ఫ్ సవరణ బిల్లు, మహిళా బిల్లు, పెద్ద నోట్ల రద్దు ఎన్డీఏ ప్రభుత్వం తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాలని తెలిపారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడి 11 ఏళ్లైనా సందర్భంగా నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనులు గురించి నడ్డా వివరించారు. సబ్కా సాత్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్, సబ్కా ప్రయాస్ అనే మంత్రంతో గత 11 ఏళ్లుగా ముందుకు సాగుతున్నామని నడ్డా తెలిపారు. 2014లో తాము అధికారంలో చేపట్టినప్పుడు భారత్ ప్రపంచంలో పదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండగా, ప్రధాని మోదీ దార్శనికతతో ప్రస్తుతం నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని అన్నారు. ఇక నుంచి ఉగ్ర దాడులను యుద్ధంగానే భావిస్తామని చెప్పారు. ఈ విషయాన్ని ప్రధాని ఇప్పటికే పలుమార్లు చెప్పారని నడ్డా గుర్తు చేశారు. రాహుల్ గాంధీ ప్రతిపక్ష నాయకుడిగా బాధ్యతరాహితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించిన ఆయన, దేవుడు ఆయనకు కాస్త బుద్ధిని ప్రసాదించాలని కోరారు. ఆపరేషన్ సిందూర్, విదేశాంగ మంత్రి జైశంకర్పై రాహుల్ ఆరోపణల నేపథ్యంలో నడ్డా ఈ మేరకు స్పందించారు.

## మోదీ 11ఏళ్ల పాలనలో ప్రజాస్వామ్యం దెబ్బతిన్నది

విశాలభారతి, స్టేట్ బ్యూరో:



కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. మోదీ సర్కార్ 11ఏళ్ల పాలనలో ఎటువంటి జవాబుదారీతనం లేదని, ప్రచారం మాత్రమే ఉందని ఆరోపించారు. ప్రస్తుతం గురించి మాట్లాడటం మానేసి, ఇప్పుడు 2047 కలలు కంటోందని ఆరోపించారు. మహారాష్ట్రలోని ఠాణెలో రద్దీగా ఉన్న లోకల్ రైలు నుంచి జారిపడి నలుగురు మరణించడం, ఆరుగురు గాయపడడంపై రాహుల్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ క్రమంలో కేంద్రం తీరుపై విమర్శనాస్త్రాలు సంధించారు. మోదీ ప్రభుత్వం 11ఏళ్ల పాలన సంబరాలు జరుపుకుంటుండగా, ముంబయి నుంచి వస్తున్న విషాద వార్త దేశ వాస్తవికత ప్రతిబింబిస్తుంది. రైలు నుండి పడి అనేక మంది మరణించారు. భారతీయ రైల్వేలు కోట్లాది మంది జీవితాలకు వెన్నెముక. కానీ నేడు అభద్రత, రద్దీ, గందరగోళానికి చిహ్నంగా మారింది. మోదీ సర్కార్ 11 ఏళ్ల పాలనలో జవాబుదారీతనం, మార్పు లేదు. ప్రచారం మాత్రమే ఉంది. 2025 గురించి మాట్లాడటం మానేసి, 2047 గురించి మాట్లాడుతోంది. ఠాణె రైలు ప్రమాద మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. గాయపడినవారు త్వరగా కోలుకోవాలి. అని రాహుల్ గాంధీ ఎక్స్ పోస్ట్ లో పేర్కొన్నారు. గత 11ఏళ్లలో మోదీ ప్రభుత్వం దేశ ప్రజాస్వామ్యం, ఆర్థిక వ్యవస్థ, సామాజిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బ కొట్టిందని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. అలాగే రాజ్యాంగంలోని ప్రతి పేజీలో నియంతృత్వ సిరాను మాత్రమే పూసిందని విమర్శించారు. ఈ మేరకు ఎక్స్ పోస్ట్ లో మోదీ సర్కార్ పై మండిపడ్డారు. "దేశంలోని అన్ని రాజ్యాంగబద్ధమైన సంస్థలను బీజేపీ, ఆర్ఎస్ఎస్లు బలహీనపరిచి, వాటి స్వయంప్రతిపత్తిపై దాడి చేశాయి. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా వెళ్లి ప్రభుత్వాలను కూల్చేసిన పార్టీ బీజేపీ. గత 11 ఏళ్లలో రాష్ట్రాల హక్కులను కాషాయ పార్టీ విస్మరించింది. అలాగే సమాఖ్య నిర్మాణం బలహీనపడింది. ద్వేషం, బెదిరింపులు, భయానక వాతావరణాన్ని వ్యాప్తి చేయడానికి నిరంతరం ప్రయత్నాలు జరుగుతున్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. గత 11 ఏళ్లలో దేశంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు, మైనార్టీలు, బలహీన వర్గాలపై దోపిడీ పెరిగిందని ఖర్గే ఆరోపించారు. వారి రిజర్వేషన్లు, సమాన హక్కులను హరించే కుట్ర జరుగుతోందని విమర్శించారు. మణిపూర్ లో కొనసాగుతున్న హింస బీజేపీ పరిపాలనా వైఫల్యానికి అతి పెద్ద సాక్ష్యమన్నారు. యూపీఏ హయాంలో సగటున 8 శాతంగా ఉన్న దేశ జీడీపీ వృద్ధి రేటును 56 శాతం వద్ద ఉంచడం బీజేపీ, ఆర్ఎస్ఎస్లు అలవాటుగా మార్చుకున్నాయని మండిపడ్డారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాల హామీని నెరవేర్చడానికి బదులుగా, యువత నుంచి ఏటా కోట్లాది ఉద్యోగాలు లాక్కుంటున్నారు. ద్రవ్యోల్బణం కారణంగా ప్రజా పొదుపులు 50ఏళ్లలో అత్యల్ప స్థాయికి చేరుకున్నాయి. ఆర్థిక అసమానతలు గత 100 ఏళ్లలో అత్యధికంగా ఉన్నాయి. నోట్ల రద్దు, జీఎస్టీ, ప్రణాళిక లేని లాక్ డౌన్ అసంఘటిత రంగాన్ని దెబ్బతీశాయి. కోట్లాది మంది ప్రజల భవిష్యత్తును నాశనం చేశాయి. మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, స్టాండ్ అప్ ఇండియా, డిజిటల్ ఇండియా, నమామి గంగే, 100 స్మార్ట్ సిటీలు వంటి కార్యక్రమాలు విఫలమయ్యాయి. భారతీయ రైల్వే నాశనమైంది. కాంగ్రెస్ (యూపీఏ) శ్రమించి నిర్మించిన మౌలిక సదుపాయాల రిబ్బన్లను మాత్రమే మోదీ కత్తిరిస్తున్నారు." అని ఖర్గే విమర్శించారు.

## SITHA యాప్ మహిళ సాధికారతకు ఒక కొత్త దిశ

- దేశంలోనే మోడల్గా నిలుస్తోంది
- మహిళలు అన్ని రంగాల్లోకి రావాలి
- గ్రామీణ మహిళలకు ఈ యాప్ మార్గదర్శిగా తీసుకోవాలి
- రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళలకు అనేక అవకాశాలు
- ఐటి మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- మహిళ సాధికారత ఒక లక్ష్యం, ఉద్యమం
- సామాజిక, ఆర్థికంగా మహిళలు ఎదగాలి
- పీసీసీ వైస్ ప్రెసిడెంట్ పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ ఝాన్సి రెడ్డి

విశాలభారతి, స్టేట్ బ్యూరో:



SITHA యాప్ మాహిళ సాధికారతకు ఒక కొత్త దిశను దేశంలోనే మోడల్గా నిలుస్తోందని ఐటి మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం జరిగిన SITHA యాప్ ఆవిష్కరణలో ఐటి మరియు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ ఝాన్సి రాజేందర్ రెడ్డి హైదరాబాద్ హైటెక్ సిటీలోని ట్రైడెంట్ హోటల్లో అత్యంత ఘనంగా జరిగిన కార్యక్రమంలో SheJobs సంస్థ అభివృద్ధి చేసిన "SITHA" యాప్ను రాష్ట్ర ఐటి, పురపాలక శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీమతి ఝాన్సి రాజేందర్ రెడ్డి , ప్రముఖ నటి శ్రీలిలా, దర్శకుడు హరీష్ శంకర్ , she jobs, వ్యవస్థాపకురాలు మిసెస్ సీత పాల్గొన్నారు.. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ SITHA యాప్" ప్రారంభం కేవలం ఒక టెక్నాలజీ ఆవిష్కరణ మాత్రమే కాదు - ఇది మహిళ సాధికారతకు ఒక కొత్త దిశ చూపించే సాంకేతిక సాధనమని పేర్కొన్నారు. మహిళలు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందినవారు, తమ ప్రతిభను, ఉత్పత్తులను దేశవ్యాప్తంగా మరియు అంతర్జాతీయంగా ప్రదర్శించే గొప్ప వేదికగా ఈ యాప్ ఉపయోగపడుతుందని వివరించారు.. తెలంగాణ రాష్ట్రం మహిళ సాధికారత దిశగా దేశంలోనే మోడల్గా నిలుస్తోంది అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళలకు అనేక అవకాశాలు కల్పిస్తూ - ఇందిరా మహిళ శక్తి మిషన్ 2025, నో ఇంటరెస్ట్ లోన్లు, మహిళల పేరిట ఇళ్ల కేటాయింపు, ఉచిత బస్సు ప్రయాణం, SHG ఉత్పత్తులకు ప్రత్యేక మార్కెట్లు, మహిళల కోసం పెట్రోల్ బంకులు, మహిళ శక్తి క్యాంటీన్లు, వంటి అనేక కార్యక్రమాలు అమలవుతున్నాయని వివరించారు. మహిళలు కేవలం ఇంటి గోడలకే పరిమితం కాకుండా, రాజకీయాలు, పారిశ్రామిక రంగం, విద్య, ఆరోగ్యం, వాణిజ్యం వంటి ప్రతి రంగంలో ముందుకు రావాలి. ఇందుకు SITHA యాప్ మద్దతుగా నిలుస్తుంది" అని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పీసీసీ వైస్ ప్రెసిడెంట్ పాలకుర్తి నియోజకవర్గ ఇంచార్జ్ ఝాన్సి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.ఈ కార్యక్రమంలో పాల్గొనడం గర్వంగా ఉందని పేర్కొంటూ, "మహిళ సాధికారత ఒక శబ్దం మాత్రమే కాక, అది ఒక లక్ష్యం, అది ఒక ఉద్యమం" అన్నారు. సామాజిక, ఆర్థికంగా మహిళలు ఎదగాలి అంటే వారికి సరైన వనరులు, వేదికలు, మార్గనిర్దేశం అవసరమని, SITHA యాప్ ద్వారా ఇవన్నీ ఒకే చోట లభిస్తాయని వివరించారు.. పాలకుర్తి నియోజకవర్గంలోనూ మహిళల కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, ముఖ్యంగా ఉద్యోగోన్ముఖ శిక్షణ, స్వయం ఉపాధి అవకాశాలు, ఆర్థిక సాయం, బృందంగా వ్యాపార అవకాశాలు కల్పించే ప్రణాళికలు అమలు చేస్తున్నామని తెలిపారు.. ఒక మహిళ ఆర్థికంగా స్వావలంబిగా మారినప్పుడు, ఆ కుటుంబం అభివృద్ధి చెందుతుంది - అదే దేశ అభివృద్ధికి మార్గం" అని ఆమె పేర్కొన్నారు..ఈ సందర్భంలో మంత్రి శ్రీధర్ బాబుకి, SheJobs సంస్థకు, యాప్ అభివృద్ధిలో భాగమైన ప్రతి ఒక్కరికి వారు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామీణ మహిళలకు ఈ యాప్ మార్గదర్శిగా, ఆశాజ్యోతిగా నిలవాలని ఆకాంక్షించారు.





## శుభాన్షు శుక్లా అంతరిక్ష యాత్ర వాయిదా

తరువాయి భాగం

ఇప్పటికే ప్రకటించింది. దీంతో బుధవారం ఈ ప్రయోగం చేపట్టనున్నారు. యాక్సియం4 పేరుతో చేపట్టిన ఈ యాత్రలో శుభాంశు మిషన్ పైలట్గా వ్యవహరిస్తారు. 28 గంటల ప్రయాణం తర్వాత అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి శుభాన్షు శుక్లా సహా మరో మిషన్ కమాండర్ పెగ్గీ విట్సన్, స్పెషలిస్టులు టిబర్ కపు (హంగరీ), స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ విస్నియెస్కీ (పోలండ్)లు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)కు పయనం కానున్నారు. 1984లో రష్యాకు చెందిన సోయజ్ రాకెట్ ద్వారా రోదసి యానం చేసిన రాకేశ్ శర్మ తర్వాత భారత పౌరుడొకరు అంతరిక్షంలోకి వెళ్లడం ఇదే తొలిసారి. వాస్తవానికి యాక్సియం 4 మిషన్ కోసం వీరు గత నెల 29నే నింగిలోకి పయనం కావాల్సింది. అయితే, దాన్ని తొలుత ఈ నెల 8కి, అనంతరం 10కి మార్చారు. తాజాగా మరోసారి వాయిదా పడింది. శుక్లా అనుభవాలను భవిష్యత్ ప్రయోగాలకు పునాదిగా మార్చుకోవాలని ఇస్రో భావిస్తోంది.



## బస్పాస్ ఛార్జీలు పెంచిన ఆర్టీసీ

తరువాయి భాగం

జీతాల చెల్లింపు వంటి వాటితో ఆర్టీసీ ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయిందని ఆర్టీసీ యాజమాన్యం తెలిపింది. వాటి నుంచి బయటపడేందుకు తప్పనిసరి పరిస్థితుల్లో బస్ పాస్ ఛార్జీలను పెంచాల్సి వచ్చిందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. బస్ పాస్ ఛార్జీలతో పాటు ఆర్టీసీ టోల్ ఛార్జీలను 10 రూపాయలకు పెంచారు. పెంచిన బస్ పాస్ ఛార్జీలతో ప్రతి నెల ఆర్టీసీకి సుమారు కోటి రూపాయల ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇటీవల టోల్ ఛార్జీలు పెరగడంతో ఆ భారం ఆర్టీసీపై పడుతుందని అందుకే టోల్ ఛార్జీలు పెంచాల్సి వచ్చిందని యాజమాన్యం పేర్కొంది.

## కొత్త మంత్రులకు శాఖల కేటాయింపుపై కసరత్తు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణపై ఎప్పటి నుంచో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. ఇప్పుడు మంత్రులకు శాఖలు కేటాయింపు, శాఖల మార్పుల, చేర్పులపైనే పార్టీలో విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఢిల్లీ చేరుకున్న సీఎం రేవంత్రెడ్డి కాంగ్రెస్ పెద్దలతో సమావేశమై చర్చించిన తరువాత హైకమాండ్ ఇచ్చే సలహాలు, సూచనలతో తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. మంత్రుల శాఖల మార్పులుచేర్పులు, కొత్త మంత్రులకు శాఖల కేటాయింపుపై మంగళవారం స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మంత్రులకు సంబంధించి పూర్తి వివరాలతో మధ్యాహ్నం ఢిల్లీ చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పెద్దలను కలువనున్నట్లు తెలుస్తోంది. మంత్రులు సమర్థవంతమైన పాలన అందిస్తూ పనితీరు మెరుగుపరుచుకోవడంతో పాటు ప్రజలకు వేగవంతమైన సేవలు అందించొచ్చని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు తెలుస్తోంది. మొన్నటి మంత్రివర్గ విస్తరణతో మంత్రుల సంఖ్య 15కు చేరింది. కొత్తగా మంత్రివర్గంలోకి వచ్చిన వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్కుమార్, గడ్డం వివేక్లకు శాఖలు కేటాయించాల్సి ఉంది. కాంగ్రెస్ పెద్దలతో మాట్లాడిన తరువాత సీఎం వారికి శాఖలు కేటాయించనున్నారు. గడిచిన పది రోజులుగా రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్ రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, పోటీ చేసిన నాయకుల అభిప్రాయాలు తీసుకున్నారు. ప్రధానంగా ప్రభుత్వ పనితీరు, పార్టీ స్థితిగతులు, మంత్రులు పని తీరు, ఇతర పార్టీల బలాబలాలు, నాయకుల మధ్య విభేదాలు తదితర అంశాలపై ఆరా తీశారు. చాలా మంది ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు మంత్రుల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. స్థానికంగా కూడా అధికారులు సక్రమంగా పలకడం లేదని, పేరుకే కాంగ్రెస్ ప్రభుత్వమని బీఆర్ఎస్ వాళ్లకే పనులు అవుతున్నాయని కొన్ని నియోజకవర్గాలకు చెందిన నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రివర్గ విస్తరణ జరిగినందున సీఎం రేవంత్ రెడ్డి కొత్తగా మంత్రివర్గంలోకి వచ్చిన ముగ్గురికి శాఖలు కేటాయించడమే కాకుండా, ఇప్పుడున్న మంత్రుల శాఖల మార్పులు, చేర్పులు చేసేందుకు కూడా సిద్ధమైనట్లు విశ్వసనీయ వర్గాలు ద్వారా తెలుస్తోంది. ప్రధానంగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న, సమర్థవంతంగా పని చేయలేని, నిఘా వర్గాల నివేదిక, మంత్రుల పనితీరు, పార్టీ నాయకుల అభిప్రాయాలు తదితర అంశాలన్నింటిని పరిగణనలోకి తీసుకుని మార్పులు చేర్పులు చేస్తారని పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. గతంలో కేసీఆర్ కేబినెట్ లో ఎవరికి ఏయే శాఖలు ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం శాఖల కేటాయింపు ఎలా ఉంది. కేటాయించిన శాఖల్లో ఆయా మంత్రులు సమర్ధవంతంగా పని చేస్తున్నారా లేదా తదితర అంశాలు పరిశీలన చేసి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.అయితే కొత్త మంత్రులకు శాఖల కేటాయింపు దగ్గర నుంచి ఉన్న మంత్రుల శాఖల మార్పులు చేర్పులు వరకు ఏఐసీసీ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. దగ్గరల్లో స్థానిక సంస్థల ఎన్నికలు ఉండే అవకాశం ఉండడంతో మార్పులు, చేర్పులు చేయడం ద్వారా నష్టం జరగకుండా కూడా తగు జాగ్రత్త తీసుకుంటారని సమాచారం.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
మంగళవారం,
10.06.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



### టీపీసీసీ నూతన కార్యవర్గాన్ని ప్రకటించిన ఏఐసీసీ

విశాలభారతి, స్టేట్ బ్యూరో:
తెలంగాణ ప్రదేశ్ నూతన కార్యవర్గాన్ని ఏఐసీసీ సోమవారం ప్రకటించింది. 27 మంది ఉపాధ్యక్షులకు టీపీసీసీ కార్యవర్గంలో చోటు లభించింది. 69 మంది ప్రధాన కార్యదర్శులకు టీపీసీసీ చోటు కల్పించినట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. కార్యవర్గం ఎంపికకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆమోద ముద్ర వేశారని పేర్కొన్నారు. ఉపాధ్యక్షులుగా ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్ , బస్వరాజు సారయ్యకు అవకాశం ఇచ్చింది. ప్రధాన కార్యదర్శుల్లో ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, సీహెచ్ పర్ణికరెడ్డి, చనగాని దయాకర్ మాట్లా రాగమయికి అవకాశం కల్పించింది.



## మహాలక్ష్మి పథకం ద్వారా
# ఆర్టీసీ లాభాలు

తరువాయి భాగం

మల్లు భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ కాలుష్యం నుండి పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకొన్ని వాతావరణంను కాపాడుకుంటూ ఆర్టీసీ సంస్థ ముందుకు వెళ్తుందని పొన్నం ప్రభాకర్ రవాణా శాఖ మంత్రి అయినప్పటి నుండి ఆర్టిసి లో సమూల మార్పులు తెచ్చి అనేక సంస్కరణలతో ముందుకు వెళ్ళటం శుభ పరిణామం అని తెలిపారు. గతంలో సామాన్యుడి అవసరాలు తీర్చేందుకు ఆర్టీసీ సంస్థ ఎంతగానో కృషి చేసింది కానీ లాభాలు లేకుండా ఎప్పుడూ నష్టాల బాటలో కొనసాగిందని కానీ ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ఆర్టీసీ అనే ప్రభుత్వ సంస్థను కాపాడుకునేందుకు, ఆర్థికంగా నిలబెట్టేందుకు తగు చర్యలతో ముందుకు వెళ్లడం జరుగుతుందని తెలిపారు. పాత బస్సులను, డీజిల్ బస్సులను పక్కకి పెట్టి ఎలక్ట్రిక్ బస్సుల ద్వారా వాతావరణాన్ని కాపాడుకుంటూ ప్రజలకు సేవ చేసేందుకు సూర్యాపేట డిపోకు 79 ఎలక్ట్రికల్ బస్సులు మంజూరైనాయని వాటిలో ఈరోజు 45 ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. రాష్ట్ర రాజధాని, ఔటర్ రింగ్ రోడ్ లోపల, హైదరాబాద్ అనే మహానగరంలో వాతావరణ ఆహ్లాదకరంగా ఉండేందుకు 2800 ఎలక్ట్రిక్ బస్సులను ఏర్పాటుచేసి సామాన్యులకు రవాణా అవసరాలు తీరుస్తూ వాతావరణాన్ని కాపాడుకుంటూ ముందుకు వెళ్తుందని అన్నారు.

మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రంలోని ఆడపడుచులు అందరు ఆర్టీసీ బస్సుల ద్వారా రాష్ట్రము లో ఎక్కడి నుంచి ఎక్కడికైనా వెళ్లేందుకు ఉచితంగా తీసుకెళ్లడం జరుగుతుందని, ఇప్పటివరకు 182 కోట్ల జీరో టికెట్లు జారీ చేశామని వాటి ద్వారా తెలంగాణ ఆడపడుచులు 6,088 కోట్ల రూపాయలు ఆదా చేసుకున్నారని, ఆ డబ్బులు ప్రభుత్వం ఆర్టీసీకి నేరుగా జమ చేయడం జరిగిందని, దానితో నేడు ఆర్టీసీ ఆర్థికంగా నిలదొక్కుకొని పూర్తి సామర్థ్యంతో రాష్ట్రమంతా బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ప్రభుత్వ సంస్థలను కాపాడేందుకు మారుతున్న మార్పులను అప్డేట్ చేసుకుంటూ భవిష్యత్ తరాలకు అందించడం జరుగుతుందని ఉప ముఖ్యమంత్రి ఈ సందర్భంగా తెలిపారు.

రాష్ట్ర రవాణా, బి సి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ చుట్టూ సూర్యాపేట నడుమ నల్గొండ అంటూ తెలంగాణ సాయుధ పోరాటం గుర్తు చేసుకుంటూ ప్రజాప్రభుత్వంలో మారుతున్నా కాలానికి అనుగుణంగా, కార్మికుల సంక్షేమం కోరుకుంటూ నేడు సూర్యాపేట డిపో నుండి హైదరాబాద్, నల్గొండ, ఖమ్మం, వరంగల్, కోదాడ లాంటి ప్రాంతాలకి వాతావరణంను కాపాడుకుంటూ 79 ఎలక్ట్రికల్ బస్ లు మంజూరు చేయటం జరిగిందని వాటిలో నేడు 45 ఎలక్ట్రికల్ బస్ లు ప్రారంభం చేయటం జరుగుతుందని అన్నారు. ఇప్పటికే హైదరాబాద్, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ లో ఎలక్ట్రికల్ బస్ లు నడుస్తున్నాయని త్వరలో నల్గొండ లో కూడా ఎలక్ట్రికల్ ఛార్జింగ్ పాయింట్ ఏర్పాటు చేసి బస్ లు మంజూరు చేస్తామని మంత్రి పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు అమ్మగారి ఇంటికి, పుణ్య క్షేత్రాలకి ఉచితంగా ఆర్టీసీ ద్వారా ప్రయాణిస్తున్నారని అన్నారు. ఇందుకు గాను ప్రతి నెల 300 నుంచి 350 కోట్ల రూపాయలు ఆర్టీసీకి ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఇస్తున్నారని తెలిపారు.ఈ ఆర్థిక సహాయం ద్వారా కార్మికుల సంక్షేమం, భవిష్య నిది, నూతన బస్సులు, కారుణ్య నియామకాలు ఇస్తున్నామని తెలిపారు.గత 10 సంవత్సరాలు ఒక్క నూతన బస్సు గాని,కొత్త ఉద్యోగం గానీ ఇవ్వకుండా ఆర్టీసీని నష్టాల ఊబిలో కురుకొనిపోయేలా చేశారని ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి వేలాది కొత్త బస్సులు, ఉద్యోగాలు నియమించటం జరిగిందని అన్నారు.ఆర్టీసీని పరిరక్షించుకుంటూ గ్రామాలకు రవాణా వ్యవస్థ చేరుకునేలా భవిష్యత్తులో కొత్త బస్సులు కొనుగోలుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తండ్రి ఈ సందర్భంగా తెలిపారు

రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాలుష్యం నుండి వాతావరణాన్ని కాపాడుకునేందుకు కాలుష్య రహిత ఎలక్ట్రిక్ బస్సులను ఏర్పాటు చేస్తుందని,మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచితంగా సేవలు అందించి ఆర్థికంగా ఆడబిడ్డలకు అండగా ప్రభుత్వం ఉంటుందని అన్నారు.

ఈ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్పి నరసింహ,ఎమ్మెల్యే లు నలమాద పద్మావతి రెడ్డి, మందుల సామెల్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ , పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి రాష్ట్ర వ్యవసాయ కమిషన్ మెంబర్ చెవిటి వెంకన్న యాదవ్ సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేనా రెడ్డి, వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, ఎక్స్యూటివ్ డైరెక్టర్లు ఉపేష ఖాన్,వెంకన్న, జేబీఎం సంస్థ ప్రతినిధి ప్రభాకర్, ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం ఎప్పటికైనా తెలంగాణకు జీవధారే

తరువాయి భాగం

కూడా కీలకమైన ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో ఆ స్థలాన్ని మార్చి తుమ్మిడి హట్టి నుంచి మేడిగడ్డకు మార్చాలని... మూడు బ్యారేజీలు నిర్మించాలని టెక్నికల్ కమిటీ నివేదిక మేరకే కొత్తగా కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను నిర్మించినట్లు చెప్పుకొచ్చారు. అయితే స్థల మార్పు, రీడిజైన్ అనేది కొత్తగా చేపట్టిందేమీ కాదని, దేశంలో అనేక ప్రాంతాల్లో మొదటగా నిర్మించ తలపెట్టిన ప్రాజెక్ట్‌లను రిడిజైన్ చేసి స్థలాలు మార్చిన సందర్భాలు ఉన్నాయని మాజీ మంత్రి వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు.

**కమిషన్ వేసిన ప్రశ్నలు ఇవే...**

**కమిషన్:** జీవో 115 ప్రకారం వేసిన మంత్రుల సబ్ కమిటీ ఎందుకు ఏర్పాటు చేశారు? మంత్రుల సబ్ కమిటీ ఏ అంశాలపై స్టడీ చేసింది?

**హరీష్‌రావు:** రైతులకు ఎక్కువ సంఖ్యలో నీళ్లు అందించాలనే లక్ష్యంతో స్టడీ కోసం అప్పటి ప్రభుత్వం సబ్ కమిటీ ఏర్పాటు చేసింది. సబ్ కమిటీలో తుమ్మల నాగేశ్వరరావు, ఈటెల రాజేందర్,హరీష్ రావు ఉన్నారు. సిడబ్ల్యుసి, రిటైర్డ్ ఇంజనీర్ల సూచనల మేరకు మేడిగడ్డ నిర్మాణం జరిగింది. మహారాష్ట్ర ఒప్పుకోలేదు కాబట్టి తుమ్మిడి హట్టి నుంచి మేడిగడ్డకు మార్చాం. 16 లక్షల కంటే ఎక్కువ ఆయకట్టుకు నీళ్లు ఇవ్వాలంటే... రిజర్వాయర్ల సంఖ్య పెంచాలని సీడబ్ల్యూసీ చెప్పింది. సీడబ్ల్యూసీ సూచనల మేరకే బ్యారేజీలు, రిజర్వాయర్ల సంఖ్య పెంచాం. మేడిగడ్డ నిర్మాణం ఒక్కరి నిర్ణయం కాదు... మేడిగడ్డ నిర్మాణానికి ముందు మంత్రులు, అధికారులు అనేక సార్లు భేటీ అయ్యారు. వ్యాప్కోస్ నివేదికల ఆధారంగా మేడిగడ్డ అన్నారం సుందిళ్ల బ్యారేజీలు నిర్మించాం. మేడిగడ్డ నిర్మించాలని రిటైర్డ్ ఇంజనీర్లు కూడా రిపోర్టులు ఇచ్చారు.

**కమిషన్:** అన్నారం సుందిళ్ళ లొకేషన్ మార్చడంపై ఏమైనా చర్యలు తీసుకున్నారా ?

**హరీష్‌రావు:** లొకేషన్ మార్పు అంశం పూర్తిగా టెక్నికల్.టెక్నికల్ రిపోర్టులు ఆధారంగా లొకేషన్స్ మారాయి. బ్యారేజీలు, ప్రాజెక్టుల లొకేషన్స్ మారడం ఇప్పుడు కొత్తేమీ కాదు. గతంలో నాగార్జున సాగర్, కాంతనపల్లి లాంటి ప్రాజెక్టులు లొకేషన్‌లు మారాయి.

**కమిషన్:** ప్రాజెక్టుల లొకేషన్‌లు మార్చే అధికారం హై పవర్ కమిటీకి అధికారం ఉందా?

**హరీష్‌రావు:** అప్పటి ప్రభుత్వం హై పవర్ కమిటీకి అన్ని అధికారాలు ఇచ్చింది .

**కమిషన్:** కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటుకు కారణం ఏంటి?

**హరీష్‌రావు:** లోన్స్ కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేశాం.

**కమిషన్:** కార్పొరేషన్ ద్వారా తీసుకున్న లోన్స్ రీపేమెంట్స్ ఎలా చేయాలనుకున్నారు?

**హరీష్‌రావు:** నీళ్లను అమ్మి లోన్లను రీపేమెంట్ చేయాలి అనుకున్నాము.

**కమిషన్:** కార్పొరేషన్ ద్వారా రెవెన్యూ జనరేట్ అయిందా? అయితే ఇంత చేశారు?

**హరీష్‌రావు:** కోవిడ్ కారణంగా రెండు సంవత్సరాలు డిలే అయింది. అప్పటికే మెదక్‌లో కోకాకోలా కంపెనీ లాంటి సంస్థలు వచ్చాయి.

**కమిషన్:** నిర్మాణ సంస్థలకు సైట్ ఆలస్యంగా ఎందుకు ఇచ్చారు?

**హరీష్‌రావు:** సాధారణంగా అప్పటి పరిస్థితులు ఆధారంగా సైట్స్ కొంత డిలే అవుతాయి.

**కమిషన్:** మేడిగడ్డ నుంచి మిడ్ మానేరుకు డైరెక్ట్ గా నీళ్లు ఇవ్వొచ్చు ఎక్స్పర్ట్ కమిటీ చెప్పిందా?.

**హరీష్‌రావు:** డైరెక్ట్‌గా నీళ్లు ఇవ్వడానికి సాధ్యం కాదని ఎక్స్పర్ట్ కమిటీ చెప్పింది.

**కమిషన్:** బ్యారేజీలలో నీళ్లను స్టోరేజ్ చేశారా?



**హరీష్ రావు:** టెక్నికల్ అంశాలు మా దృష్టిలో ఉండవు.

**కమిషన్:** కాళేశ్వరం ద్వారా ఎన్ని నీళ్లలో స్టోరేజీ చేశారు ?

**హరీష్ రావు:** రిజర్వాయర్ల ద్వారా 141 టీఎంసీల నీళ్లను స్టోరేజ్ చేశాం.

**కమిషన్:** బ్యారేజీలలో ఫుల్ లెవెల్ ట్యాంక్ వరకు నీళ్లను స్టోర్ చేశారా ?

**హరీష్ రావు:** టెక్నికల్ అంశాలు అధికారులు మాత్రమే చూసుకుంటారు.

**కమిషన్:** బ్యారేజీలలో నీళ్లను నింపమని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందా?

**హరీష్ రావు:** బ్యారేజీలలో నీళ్లను నింపమని ఎవరు ఆదేశించలేదు.

కాళేశ్వరం కార్పొరేషన్, డిజైన్ల మార్పు, బ్యారేజీలలో నీళ్లను నింపడం, డిజైన్లు తయారీపై హరీష్‌రావును కమిషన్ ప్రశ్నించింది. మహారాష్ట్ర ఒప్పుకోలేదు కాబట్టే మేడిగడ్డ నిర్మాణం జరిగిందని, కమిషన్ ముందు కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ చూపించి మరీ వివరించారు మాజీ మంత్రి. కమిషన్ ముందు జీవోలు, డాక్యుమెంట్ ఆధారంగా మాజీ మంత్రి హరీష్ రావు సమాధానాలు చెప్పారు.

# ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్స్ ఐఈడీ పేలుడులో ఏఎస్పీ మృతి

- డీఎస్పీ, సీఐ సహా కొందరు కానిస్టేబుళ్లకు తీవ్ర గాయాలు
- నేడు బస్తర్‌లో మావోయిస్టులు బంద్‌కు పిలుపు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:
ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లాలో మావోయిస్టులు ఘాతుకానికి పాల్పడ్డారు. డోంగ్రా గ్రామ పరిధిలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసుల వాహనాన్ని ఐఈడీతో పేల్చివేశారు. ఆ ఘటనలో ఏఎస్పీ ఆకాష్ రావు మృతిచెందారు. డీఎస్పీ, సీఐ సహా కొందరు కానిస్టేబుళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని కోంటా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. మావోయిస్టులు మంగళవారం ఈ ప్రాంతంలో బంద్‌కు పిలుపునివ్వడం వల్ల పోలీసులు పెట్రోలింగ్ చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. ఈ పేలుడు ఉదయం 910 గంటల మధ్య జరిగిందని చెబుతున్నారు. బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ ఈ పేలుడు ఘటనను ధృవీకరించారు. 2009 తర్వాత మొదటిసారిగా ఛత్తీస్‌గఢ్‌లో ఒక సీనియర్ పోలీసు అధికారి మావోయిస్టుల కారణంగా చనిపోవడం ఇదే మొదటిసారి. మే 2009లో రాజ్‌నంద్‌గావ్‌లోని మదన్‌వాడలో మావోయిస్టులు పోలీసు బృందంపై దాడి చేశారు. ఈ దాడిలో అప్పటి SP వినోద్ చౌబే మరణించారు. జూన్ 10న బస్తర్‌లో మావోయిస్టులు బంద్‌కు పిలుపునిచ్చారు. దీంతో అటు పోలీసులు, ఇటు బద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. మావోయిస్టు కోసం అడవిని జల్లెడపడుతున్నాయి.

# మావోయిస్టు మైలారపు అడెల్లు అంత్యక్రియలు

- ఈ నెల 6న బీజాపూర్ ఎన్‌కౌంటర్‌లో మృతి
- అనేకసార్లు తప్పించుకున్న అడెల్లు
- ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక బహుజనులు మృతి

విశాలభారతి, స్టేట్ బ్యూరో:
మావోయిస్టు రాష్ట్ర కమిటీ సభ్యుడు, కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల ఇన్‌చార్జి మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్ ఈ నెల 6న ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. ఆయన మృతదేహం ఆదివారం రాత్రి బోథ్ మండలంలోని తన స్వగ్రామం పొచ్చెరకు చేరుకున్నది. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులు ఆయన అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెల్యే అనిల్ జాదవ్.. భాస్కర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియలకు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఆపరేషన్ ఖగార్ పేరుతో అమాయక బహుజనులను పొట్టనపెట్టుకోవడం సరి కాదన్నారు. మావోయిస్టులతో చర్చలు జరిపి వారి డిమాండ్లను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. అడెళ్లు కుటుంబానికి ప్రభుత్వం తరపున సహాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుల శ్రీనివాస్, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. 199697లో ఇంటర్మీడియట్ చదువుతున్న సమయంలో ఆర్‌ఎస్‌యూ (రాడికల్ స్టూడెంట్ యూనియన్)కు ఆకర్షితుడైన అడెల్లు.. అప్పటి నక్సలైట్ ఉద్యమంలో చేరాడు. అంచలంచలుగా ఎదుగుతూ రాష్ట్ర కమిటీ సభ్యుడు అయ్యారు. మావోయిస్టు పార్టీలోని ఓ కీలక మహిళా నేతను పెండ్లి చేసుకున్నారు. ఆసిఫాబాద్, మంచిర్యాల జి ల్లాల్లో పార్టీని బలోపేతం చేసేందుకు అడెల్లు 2020 జూన్‌లో ఆసిఫాబాద్ జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. అటవీ ప్రాంతాల్లోని మారుమూల గ్రామాల్లో పర్యటించి మావోయిస్టు పార్టీల్లో యువకులను చేర్చుకునేందుకు ప్రయత్నించారు. తిర్యాణి అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్న గ్రేహౌండ్స్ దళాలు, ఇతర ప్రత్యేక పోలీసుల బలగాలకు మూడుసార్లు ఎదురుపడి తృటిలో తప్పించుకున్నారు. 2020 సెప్టెంబర్‌లో ఆసిఫాబాద్ మండలం చిలాటిగూడ అటవీ ప్రాంతంలోని చేలల్లో పోలీసులకు తారసపడి తృటిలో తప్పించుకుపోయారు. అప్పటి డీజీపీ మహేందర్ రెడ్డి జిల్లాలో ఆరు రోజుల పాటు మకాం వేసి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. దాదాపు మూడు నెలల పాటు గ్రే హౌండ్స్ దళాలు అడవులను జల్లెడ పట్టినప్పటికీ మావోయిస్టు నేత మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్ పోలీసులకు చిక్కలేదు. ఈ ఘటనలు జరిగిన మూడు నెలలకు 2020 సెప్టెంబర్ 19న కాగజ్‌నగర్ ఈస్‌గాం పోలీస్టేషన్ పరిధిలోని కదంబా అడవుల్లో ఇద్దరు మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు.ఈ కాల్పుల్లో ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌కు చెందిన మావోయిస్టు చుక్కాలు, ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం అద్దాల తిమ్మాపూర్‌కు చెందిన జుగ్నాక బాజీరావు చనిపోయారు. ఈ ఎన్‌కౌంటర్‌లో కూడా మైలారపు అడెల్లు చాకచక్యంగా తప్పించుకున్నట్లు పోలీసులు భావించారు. శుక్రవారం (జూన్ 6న) ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృత్యువాత పడ్డారు. ప్రభుత్వం ఈయనపై రూ. 25 లక్షల రివార్డును ప్రకటించింది.



# రేణుక ఎల్లమ్మ తల్లి మునిరాజు కళ్యాణ మహోత్సవం

- శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లవేళలా రాష్ట్ర ప్రజలపై ఉండాలి
- భువనగిరి పార్లమెంట్ టిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ క్యామ మల్లేష్

పెద్ద అంబర్ పేట్,విశాలభారతి:
శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ మునిరాజు మల్లికార్జున భ్రమరాంబ కేతమ్మ వారి కళ్యాణ మహోత్సవంలో క్యామ మల్లేష్ పాల్గొన్నారు. అబ్దుల్లాపూర్మెట్ మండలం అనాజ్ పూర్ గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ శ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి మునిరాజు మల్లికార్జున భ్రమరాంబ కేతమ్మ వారి కళ్యాణ మహోత్సవంలో యాదవ సంఘం ఆహ్వానం మేరకు కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్యామ మల్లేష్ మాట్లాడుతూ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లవేళలా రాష్ట్ర ప్రజలపై ఉండి వారు సుఖ సంతోషాలతో అష్టైశ్వర్యాలతో పాడి పంటలతో ఉండలని రైతన్నలకు సకాలంలో వర్షాలు కురిసి రైతుల ఇంట సిరులు పండాలని అన్నారు,ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దండెం రామ్ రెడ్డి, దేవాలయ అధ్యక్షులు జొన్నల రంగయ్య, టిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు విజయ భాస్కర్ రెడ్డి,అబ్దుల్లాపూర్మెట్ రైతు సహకార సంఘం చైర్మన్ భరత్, సింగిల్ విండో బ్యాంక్ వైస్ చైర్మన్ నార్లకొండ మల్లమ్మ, జంగయ్య యాదవ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కోనపురి కవిత రాములు, విద్యార్థి విభాగం నాయకులు నవీన్ గౌడ్,వెంకటేష్ యాదవ్, తాటిపల్లి పోశయ్య,రేఖ బిక్షపతి, జొన్నల మల్లేష్,మాజీ ఉపసర్పంచ్ నార్ల కొండ మాధవి శ్రీశైలం,యువజన విభాగం ఉపాధ్యక్షులు తాటిపల్లి శ్రీశైలం గౌడ్, యువజన నాయకులు రాజు యాదవ్, సుర్వి శంకర్ గౌడ్, గడ్డం లింగయ్య, పండుగల రాము ,ఎంజాల రాంబాబు, మొగుళ్ళ రామ్ రెడ్డి, తంగిడిపల్లి అక్షయ రెడ్డి, జొర్రి గల మధుసూదన్ రెడ్డి, ఎరుకల పవన్ గౌడ్, గ్రామ పెద్దలు యాదవ సంఘం సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు



విశాల భారతి
తెలుగు దిన పత్రిక
మంగళవారం,
10.06.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## 20న ఎల్బీ స్టేడియంలో యోగా వేడుకలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:యోగా ప్రాధాన్యాన్ని గుర్తించిన ఐక్యరాజ్య సమితి జూన్ 21ని అంతర్జాతీయ యెగా దినోత్సవంగా ప్రకటించి పదేళ్లు నిండుతున్న సందర్భంగా ఈ నెల 20న ఎల్బీ స్టేడియంలో యోగా ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. యోగా వేడుకలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందని అన్నారు. 20న ఉదయం 5 గంటలకు నిర్వహించే వేడుకల్లో అందరూ భాగస్వాములు కావాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో యోగా వేడుకల సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని ప్రకటించి 50 ఏళ్లు నిండుతున్న సందర్భంగా నాటి చీకటి రోజుల వాస్తవాలను, ప్రజలు పడిన ఇబ్బందులను నేటి యువతకు తెలియజేయడానికి విస్తృతంగా సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమర్జెన్సీని వ్యతిరేకించిన జాతీయ వాదులను ప్రభుత్వం చిత్రహింసలకు గురిచేసి జైల్లో పెట్టిందని, ఆ చీకటి రోజులను ప్రజలు నేటికీ మరచిపోలేదని చెప్పారు. మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి 11 ఏళ్లు నిండుతున్న సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



## ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి

**- పిడిఎస్ యు వినతి**

**కరీంనగర్,విశాలభారతి:** నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కాబోతున్నందన ప్రభుత్వ పాఠశాలలో మౌళిక సదుపాయాలు కల్పించాలని, ప్రైవేట్ ,కార్పోరేట్ విద్యా సంస్థల పై చర్యలు తీసుకోవాలని కోరుతూ జార్జి రెడ్డి పి డి ఎస్ యు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సూపరిండెంట్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రత్నం రమేష్ మాట్లాడుతూ.... గతేడాది మధ్యాహ్న భోజనంలో నాణ్యత లేమి పై చాలా చర్చ జరిగిందని ఈ నేపధ్యంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని కోరుతున్నామని అన్నారు. విద్యార్థులకు ఇచ్చే పాఠ్య పుస్తకాలు,యూనిఫామ్ లు సకాలంలో ఇవ్వకపోవడం వలన విద్యార్థులు అధ్యయనంలో వెనుకపడిపోతున్నారని పాఠశాలలు ప్రారంభమైన రెండు రోజుల్లో అన్ని సబ్జెక్ట్ ల పుస్తకాలను విద్యార్థులకు ఇవ్వాలని కోరారు.ప్రైవేట్, కార్పోరేట్ పాఠశాలలో ఫీజులు దోపిడి అరికట్టాలని,గుర్తింపు లేని సంస్థలు పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జార్జ్ రెడ్డి పి.డి. ఎస్ యు నాయకులు ఇరువురాల కళ్యాణ్, నవీన్, సంపత్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.



## నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

**కరీంనగర్,విశాలభారతి;** ప్రైవేట్ , కార్పొరేట్ పాఠశాలలలో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని స్థానిక భాస్కర్ రావు నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ఏఐఎస్ఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సాయి ఆజాద్ అధ్యక్షత వహించగా ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం ముఖ్య అతిథులుగా జార్జిరెడ్డి పిడి.ఎస్.యూ జిల్లా అధ్యక్షులు బరిగెల ప్రసన్న, బీఆర్ఎస్వి రామగుండం నియోజకవర్గ ఇన్చార్జ్ కొలుగూరి చింటూ హాజరైనారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రైవేట్ ,కార్పొరేట్ పాఠశాలలు విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఆకర్షించే విధంగా రంగురంగుల కరపత్రాలతో లేనివి ఉన్నట్టు తప్పుడు ప్రచారం చేస్తూ ఉచిత రవాణా సౌకర్యం, ఫీజులలో రాయితీ కల్పిస్తామని మాయ మాటలు నమ్మబలికి విద్యార్థులను పాఠశాలలో చేరిన తర్వాత మొత్తం ఫీజు వసూలు చేస్తున్నారని, తల్లిదండ్రులు మాయ మాటలను నమ్మవద్దని కోరారు. నియమ నిబంధనలు పాటించని పాఠశాలలపై విద్యాధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఐక్య కార్యాచరణ చేపడతామని వారన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కోశాధికారి ఎల్కపల్లి సురేష్, గాజుల వినయ్, బన్నీ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం సొంత జిల్లాలో దళితులపై దాడులను అరికట్టాలి

**- ధర్మసమాజ్ పార్టీ నాయకులు బొంకూరి రాజు**




**విశాలభారతి,ఎల్కతుర్తి:** తెలంగాణ రాష్ట్రముఖ్యమంత్రి సొంత జిల్లాలో దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో బొంకూరి రాజు అన్నారు. తాండూరు ప్రాంతంలోని బెల్కటూర్ గ్రామంలో దళితుల ఇంట్లో పెళ్లి జరిగిన అనంతరం సాయంత్రం ఊరేగింపు కార్యక్రమాన్ని గ్రామంలోని అగ్రవర్ణాలు కుల వివక్షతో అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తెలంగాణ శాసనసభ స్పీకర్ సొంత గ్రామం కావడం అత్యంత శోచనీయమన్నారు. ఆ గ్రామం నుండి రాష్ట్ర శాసనసభ స్పీకర్ స్థానంలో ఒక దళితుడు ఉన్నప్పటికీ ఆ గ్రామంలో మాత్రం కుల వివక్ష పోవడం లేదన్నారు. భారతరాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు కావస్తున్నప్పటికీ దళితులపై అణిచివేత తగ్గడం లేదు ప్రభుత్వాలు దళితుల హక్కులను అమలు చేయడంలో విఫలమవుతున్నాయి. దళితుల రక్షణకై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాలు వచ్చినప్పటికీ అగ్రవర్ణ పాలకవర్గాల మూలంగా చట్టాలు నిష్పక్షపాతంగా అమలు కావడం లేదన్నారు. దళితుల ఇంట్లో సంబరాలు చేసుకోవాలన్న భయపడాల్సిన పరిస్థితి వస్తుంది బెల్కటూరులో దళితులపై దాడులకు పాల్పడిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలి. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన దృష్టి సారించి గ్రామ గ్రామాన కుల నిర్మూలనకై చట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని ఈ సందర్భంగా బొంకూరి రాజు అన్నారు


పసుమములలో షెటర్ల నిర్మాణం..


పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటి విజయవాడ హైవేకు నిర్మిస్తున్న షెడ్డు.

# అక్రమ నిర్మాణాలపై చర్యలేవి

- **పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీలో పుట్టగొడుగుల రేకుల షెడ్లు, షట్టర్ల నిర్మాణాలు**
- **పట్టించుకోని మున్సిపల్ కమిషనర్ టౌన్ ప్లానింగ్ అధికారులు**
- **మున్సిపాలిటీ ఆదాయానికి రూ" లక్షల్లో గండి కొడుతున్న అక్రమనిర్మాణాలు**
- **ముడుపుల మత్తులో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు**

**పెద్ద అంబర్పేట్,విశాలభారతి:** పెద్ద అంబర్ పేట మున్సిపల్ పరిధిలో భారీ అక్రమ రేకుల షెడ్లు కమర్షియల్ షట్టర్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి పెద్ద అంబర్ పేట్,గౌరెల్లి, తారామతి పెట్, కుంట్లూర్, పసుమాముల ప్రాంతాల్లో జోరుగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు, పెద్ద అంబర్పేట మున్సిపాలిటీ నుండి కోహెడ వెళ్లే ప్రధాన రోడ్డు రిజిస్ట్రేషన్ ఆఫీస్ కు సమీపంలో కొందరు అక్రమ నిర్మాణ దారులు యదేచ్ఛగా భారీ ఎత్తున కమర్షియల్ రేకుల షెడ్ల నిర్మాణం చేపడుతున్నారు. ఇలా నిర్మాణాలు చేపట్టి కమర్షియల్ షాపులకు కిరాయిలకు ఇచ్చి లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. కానీ మున్సిపల్ కమిషనర్ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు సిబ్బంది, మాత్రం తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తూ నోటీసుల పేరుతో మమ అనిపిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి, అక్రమ నిర్మాణాల పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో మున్సిపాలిటీ ఆదాయానికి లక్షల్లో గండి పడుతోందని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

**చర్యలు తీసుకోవడంలో కాలయాపన.**

గ్రేటర్ హైదరాబాద్ శివారు ప్రాంతాలైన హయత్ నగర్, పెద్ద అంబర్పేట్ తో పాటు అబ్దుల్లాపూర్మెట్ మండలం అభివృద్ధిలో భాగంగా శరవేగంగా విస్తరిస్తూ ఎన్నోకొత్త కాలనీలు వెలుస్తున్నాయి, అదే అదునుగా ముఖ్య కూడలితోపాటు ప్రధాన రోడ్ల వెంట కొందరు ప్లాట్ యజమానులు జిహెచ్ఎంసి మున్సిపాలిటీల నుండి ఎలాంటి పర్మిషన్లు తీసుకోకుండానే భారీ రేకుల షెడ్లు కమర్షియల్ నిర్మాణాలతో షాపులు ఏర్పాటు చేస్తున్నారు. షాపులను కిరాయికి ఇచ్చి నెలకు లక్షల్లో వసూలు చేస్తున్నారని.. వీటిలో పలు రకాల వ్యాపార వాణిజ్య లావాదేవీలు యదేచ్ఛగా కొనసాగిస్తూన్నా.... రోడ్ల ప్రక్కన వాటితో స్థానికులు ఇబ్బందులు పడుతున్న.... ఎవరు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి, అక్రమంగా నిర్మించి వ్యాపారాలు నిర్వహిస్తున్న ఈ దుకాణాల సముదాయాల నుంచి జిహెచ్ఎంసి కి మున్సిపాలిటీలకు ఎలాంటి ప్రాపర్టీ టాక్స్ లు కూడా రావడం లేదు వీటిని కట్టడి చేయడంలో టౌన్ ప్లానింగ్ మున్సిపాలిటీ అధికారులు విఫలమయ్యారు,సిబ్బంది కాసులకు కక్కుర్తి పడి చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి, ఇది ఏంటని అడిగిన వారికి ఒకటో నోటీసు.. రెండో నోటీసు.. ఇస్తామంటూ కాలయాపన చేస్తూ నిర్మాణాలు పూర్తి చేస్తున్నారే తప్ప.... చర్యలు మాత్రం తీసుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ అక్రమ నిర్మాణాలకు కేరాఫ్ అడ్రస్ గా మారింది కోహెడ రోడ్డు నందు పెద్ద ఎత్తున నిర్మాణాలు రేకుల కమర్షియల్ షెడ్లు గౌరెల్లి శివపార్వతి కూడలి సమీపంలో మరొకటి కమర్షియల్ రేకుల షెడ్డు నిర్మాణం పలుమార్లు వివిధ పత్రికల్లో వచ్చిన వార్తలను కూడా చూసి చూడనట్లు వదిలేస్తున్నారు,కానీ భారీ ఎత్తున నిర్మిస్తున్న షెడ్డు నిర్వాహకులపై మాత్రం చర్యలు మాత్రం శూన్యం ఒక్క నోటీసు కూడా ఇవ్వకుండా షెడ్ నిర్మాణం పూర్తి అయ్యేంతవరకు చూస్తూ కాలయాపన చేస్తున్నారు.

**స్పందించని మున్సిపల్ కమిషనర్ టౌన్ ప్లానింగ్ అధికారులు..**

పెద్ద అంబర్పేట్ గౌరెల్లి, తార మతి పేట, పసుమాముల కుంట్లోరూ, తట్టి అన్నారం ప్రాంతాలలో వెలుస్తున్న అక్రమ షెడ్ల నిర్మాణాలపై కమిషనర్ టౌన్ ప్లానింగ్ అధికారులు నుండి వివరణ కోసం ప్రయత్నించగా వారు స్పందించకపోవడం తో పై ఆరోపణలు నిజమని తెలుస్తోంది.


గౌరెల్లి రోడ్డులో అక్రమంగా నిర్మిస్తున్న షెడ్డు


కుంట్లూర్ నుండి పసుమముల రోడ్డులో నిర్మించిన కమర్షియల్ షెడ్



## పేదల కలలను సాకారం చేసే దిశగా ప్రభుత్వ కృషి

**- హుస్నాబాద్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల చైతన్య.**

**విశాలభారతి, ఎల్కతుర్తి:** ఎల్కతుర్తి మండలంలోని వల్బపూర్ గ్రామంలో పడితల బతుకమ్మ,కి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా సోమవారం వారికి ముగ్గుపోశారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నాయకులు యూత్ కాంగ్రెస్ హుస్నాబాద్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి, ఎర్రోళ్ల చైతన్య, మాట్లాడుతూ పేదల కలను సాకారం చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు, పొన్నం ప్రభాకర్ కృషి వలనే అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి పేదల పక్షపాతిగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందని అన్నారు, ఈ ప్రజా ప్రభుత్వంలో సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా పాలన సాగుతుందన్నారు, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేస్తూ ఆరు గ్యారెంటీలను అమలు చేస్తూ ప్రజల్లో సంతోషాన్ని నింపడమే తమ ఆశయమని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా మాజీ జనరల్ సెక్రెటరీ, మండ, సుమన్ గౌడ్, ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు, పడితేలా బతుకమ్మ, రాజేశ్వరరావు, స్వామి రావు, ఇంద్రనగర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు, అంబాల రమేష్, గొర్రె శ్రీనివాస్, వల్బాపూర్, గ్రామ కార్యదర్శి, నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## దుబాయ్ లో 'మట్టి మేధావి సత్తయ్య' పుస్తకావిష్కరణ

- **గల్ఫ్ లో ఘనంగా మహనీయుల జయంతి వేడుకలు**
- **వక్తగా హాజరైన తెల్లాపూర్ మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్**

**పటాన్ చెరు,విశాలభారతి** కార్మికుల సంక్షేమం, అణగారిన వర్గాల ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా అహర్నిశలు తప్పించే శ్రమశక్తి అవార్డు గ్రహీత కొల్లూరి సత్తయ్య జీవిత చరిత్రను వివరిస్తూ రచించిన 'మట్టి మేధావి సత్తయ్య' పుస్తకాన్ని దుబాయిలో అంగరంగ వైభవంగా ఆవిష్కరించారు. దుబాయిలో గల్ఫ్ అంబేద్కరైట్స్ మూమెంట్ సంస్థ ఆధ్వర్యంలో భారతదేశ మహనీయులైన చత్రపతి శివాజీ, మహాత్మ జ్యోతిరావు పూలే, బాబాసాహెబ్ బిఆర్ అంబేద్కర్ ల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తెల్లాపూర్ తాజా మాజీ కౌన్సిలర్, పూలే అంబేద్కర్ సెంటర్ ఫర్ ఫిలాసఫీ అండ్ ఇంగ్లీష్ ట్రైనింగ్ ఫౌండర్ కొల్లూరి భరత్ ను వక్తగా ఆహ్వానించారు. ప్రధానంగా కార్మిక, శ్రామిక వర్గానికి శివాజీ, పూలే, అంబేద్కర్లు చేసినటువంటి పోరాటాలు, ఉద్యమాలు, కృషిని దుబాయ్ కార్మికులకు తెలియజేసేందు కోసం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొల్లూరి సత్తయ్య జీవిత చరిత్రను వివరిస్తూ రచయిత, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్ రచించిన మట్టి మేధావి సత్తయ్య పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం భరత్ మాట్లాడుతూ అస్పృశ్యత, అసమానతల నిర్మూలన కోసం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చేసిన కృషి అనిర్వచనీయమన్నారు. బడుగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఆయన చేసిన ప్రయత్నాలు ఎనలేనివని, సమానత్వమే ఆయన ఆయుధంగా మార్చుకుని చివరి శ్వాస వరకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎన్నో ఉద్యమాలు పోరాటాలు చేశారని గుర్తు చేశారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

మంగళవారం,
10.06.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## 'కాళేశ్వరం' మరో దేశంలో నిర్మించి ఉంటే చరిత్రలో నిలచిపోయేది: కేటీఆర్

కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశమైంది. ఈ ప్రాజెక్టు ప్రయోజనాలు ప్రజలకు తెలుసని, కేవలం కేసీఆర్‌ను అప్రతిష్ఠపాలు చేయడమే లక్ష్యంగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పనిచేస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కాళేశ్వరం అంశంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ ఎదుట సోమవారం మాజీ మంత్రి హరీశ్‌రావు విచారణకు హాజరయ్యారు. ఈ పరిణామాల నేపథ్యంలో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టుపై తమ ప్రభుత్వ వైఖరిని, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై కీలక వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఒకవేళ మరో దేశంలో నిర్మించి ఉంటే, అది చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయేదని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. కానీ మన దేశంలో కాంగ్రెస్, బీజేపీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం దీనిని ఒక పావుగా మార్చుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రాజెక్టు నిర్మాణం అనేది ఏ ఒక్క వ్యక్తి తీసుకున్న నిర్ణయం కాదు. మంత్రివర్గ ఆమోదంతోనే నిర్మాణం చేపట్టాం. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రభుత్వ విధానపరమైన నిర్ణయం. దీనిని ఆచరణలో పెట్టే బాధ్యత అధికారులు, ప్రభుత్వ యంత్రాంగంపై ఉంటుంది" అని కేటీఆర్ వివరించారు. ప్రాజెక్టు నిర్మాణంలో ఎలాంటి అవకతవకలు జరగలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. కాళేశ్వరం విషయంలో దాచిపెట్టాల్సింది ఏమీ లేదని, అయినప్పటికీ అసత్య ఆరోపణలు చేస్తూ నోటీసులతో వేధిస్తున్నారని ఆయన మండిపడ్డారు. కమిషన్ ముందు మాజీ మంత్రి హరీశ్ రావు అన్ని అంశాలను కూలంకషంగా వివరించారని, ఇక కేసీఆర్ కొత్తగా చెప్పడానికి ఏమీ ఉండదని కేటీఆర్ తెలిపారు.



## నిరుపేదలకు వరం సీఎంఆర్ఎఫ్

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- 19 లక్షల 85 వేల రూపాయల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పటాన్ చెరు,విశాలభారతి: నిరుపేదలకు కార్పోరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.సోమవారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలు, పట్టణాలకు చెందిన 41 మంది లబ్ధిదారులకు మంజూరైన 19 లక్షల 85 వేల రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే జీఎంఆర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నిరుపేదలకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తూ వారి ఆర్థిక అభ్యున్నతికి అండగా ఉంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుమ్మడిదల మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్, అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, సీనియర్ నాయకులు విజయభాస్కర్ రెడ్డి, షేక్ హుస్సేన్, ప్రమోద్ గౌడ్, మురళి, తదితరులు పాల్గొన్నారు.





## ఎల్బీనగర్ ప్రజల సమస్యల పరిష్కారమే నా లక్ష్యం

- మధుయాష్కీ గౌడ్
- సమస్యలు పరిష్కరించాలని కోరిన కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు
- అప్పటికప్పుడే అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని సూచించిన మధుయాష్కీ

ఎల్బీనగర్ ,విశాలభారతి: టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కీ గౌడ్ కి ఎల్బీ నగర్ నియోజకవర్గంలోని పలు కాలనీలో నుంచి వినతుల వెల్లువ వచ్చాయి. హయత్ నగర్ టీ నగర్ కాలనీలోని వారి నివాసంలో సోమవారం భారీగా పలు కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు వచ్చి కలిశారు. వారి కాలనీలలో నెలకొన్న సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. డ్రైనేజీ, రోడ్లు, మంచినీటి సమస్యలను వివరించారు. స్పందించిన మధుయాష్కి గౌడ్ . కాలనీలవారీగా సమస్యలపై ఒక్కొక్కటిగా అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. కాగా కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయ నూతన చైర్మన్గా ఎన్నికైన ఈదులకంటి సత్య నారాయణ రెడ్డి ధర్మకర్తలతో కలిసి మధుయాష్కీ ని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయనను మధుయాష్కీ సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ , మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్ గౌడ్ , డివిజన్ల అధ్యక్షులు చెన్నగోని రవీందర్ గౌడ్, వేణుగోపాల్ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, బుద్దా సత్యనారాయణ తదితరులు కలిశారు.



## నేడు పదవ తరగతి ప్రతిభావంతులకు నగదు పురస్కారాల పంపిణీ

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్ చెరు,విశాలభారతి: ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థినీ విద్యార్థులను ప్రోత్సహించడంలో భాగంగా మంగళవారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్లో నగదు పురస్కారాల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల విద్యాశాఖ అధికారులు, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సమయంలో మానసిక స్థైర్యం పెంపొందించేందుకు వ్యక్తిత్వ వికాస నిపుణులతో శిక్షణ తరగతులు నిర్వహించడంతో పాటు.. పరీక్ష సామాగ్రి సైతం అందించడం జరుగుతోందని తెలిపారు. అదే విధంగా..ఫలితాల్లో అత్యుత్తమ మార్పులు సాధించిన విద్యార్థులను సైతం ప్రోత్సహించాలన్న లక్ష్యంతో నగదు పురస్కారాల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విద్యార్థినీ విద్యార్థులకు పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో విద్యాశాఖ అధికారులు పాండురంగం రాథోడ్, నాగేశ్వరరావు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## వీడిన మర్డర్ మిస్టరీ

- నగల కోసం హత్య

రాజేంద్రనగర్, విశాలభారతి: ఓ మిస్టరీని నార్సింగి పోలీసులు చేదించారు. ఇటీవల అదృశ్యమైన వృద్ధురాలు హత్యకు గురైనట్లు గుర్తించారు. కేసు వివరాలను నార్సింగ్ ఇన్స్పెక్టర్ హరికృష్ణారెడ్డి మీడియాకు వెల్లడించారు.3వ తేదీ ఉదయం 05:30 గంటలకు నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో నివసించే ఆర్. బాలమ్మ (75) వాకింగ్ కోసం వెళ్లి అదృశ్యమైంది. పొరుగు ఇంటికి చెందిన అనిత పై అనుమానం వ్యక్తంచేస్తూ బాలమ్మ కోడలు రామేశ్వరం లక్ష్మి మరుసటి రోజు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. అనితను 07న పట్టుకుని విచారించారు. అనిత ఏడాది క్రితం తన సొంతస్థలం వికారాబాద్ జిల్లా పరిగి మండలం మిట్టకోడూరు గ్రామం నుంచి ఏడాది క్రితం ఖానాపూర్ కు వలస వచ్చి ఉంటున్నట్లు గుర్తించారు. పక్కా ప్లాన్ ప్రకారం ఆమె బాలమ్మకు మాయమాటలు చెప్పి ఆమెను ట్రాప్ చేసింది. ఆమెను చంపి ఒంటిపై ఉన్న నగలను తీసుకోవాలని ఉద్దేశంతో 3వ తేదీ ఉదయం 5 గంటలకు బాలమ్మకు మాయమాటలు చెప్పి తనతో పాటు వికారాబాద్ జిల్లా కండ్లపల్లి ఫారెస్ట్ లోకి నిర్మానుష్య ప్రదేశంలోకి తీసుకెళ్లి బాలమ్మను చంపి ఆమె ఒంటిపై ఉన్న బంగారు గొలుసు,



బంగారు గుండ్లు, వెండి కడియాలు, వెండి పట్టీలు తీసుకొని మృతదేహాన్ని అక్కడే వదిలేసి పారిపోయింది. ఘటనా స్థలం కోడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందని నార్సింగి పోలీసులు గుర్తించి పూడూరు తాసిల్దార్ ను కలిసి జరిగిన విషయం తెలిపారు. అప్పటికే పూడూరు పోలీసులు పూర్తిగా కూలిపోయిన మృతదేహాన్ని గుర్తించి అక్కడే ఖననం చేశారు. అనంతరం నార్సింగి పోలీసుల విజ్ఞప్తి మేరకు 5వ తేదీ మృతదేహాన్ని వెలికి తీయించగా కుటుంబ సభ్యులు ఆమెను గుర్తించారు. అనిత బాలమ్మను చంపినట్లు నిర్ధారించారు. అనిత నుంచి సుమారు మూడు తులాల బంగారు, 57 తులాల వెండి నగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని రిమాండ్ కు తరలించినట్లు ఇన్స్పెక్టర్ హరికృష్ణ రెడ్డి సోమవారం తెలిపారు.





## కాళేశ్వరం కమిషన్ విచారణ సందర్భంగా.. హరీష్ రావును కలిసిన బీఆర్ఎస్ నేతలు

- బీఆర్ కే భవన్ వద్ద బీఆర్ఎస్ నాయకుల నిరసన

పటాన్ చెరు,విశాలభారతి కాలేశ్వరం ప్రాజెక్టుపై కాళేశ్వరం కమిషన్ విచారణలో భాగంగా మాజీ మంత్రి హరీష్ రావు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు హాజరుకానున్న సందర్భంగా సోమవారం పటాన్ చెరు నియోజకవర్గం ముఖ్య నేతలు తెలంగాణ భవన్ లో కలిశారు. పటాన్ చెరు నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, ముక్య నాయకులు హరీష్ రావును కలిశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హాజరైన సమయంలో బి.ఆర్.కె భవన్ వద్ద బిఆర్ఎస్ పార్టీ నేతలు నిరసన తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన విచారణను రాజకీయ ప్రత్యర్థులపై ప్రతీకారంలో భాగమేనని ఆరోపించారు. కాలేశ్వరం ప్రాజెక్ట్ రాష్ట్రాభివృద్ధికి ఒక నిదర్శనమని, దీనిని రాజకీయ లబ్ధికోసం తప్పుదోవ పట్టించరాదని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి రెడ్డి, జిన్నారం మండలం మాజీ జడ్పీటీసీ కొలను బాల్ రెడ్డి, రామచంద్రపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, బిఆర్ఎస్ యూత్ నాయకులు పృథ్వీరాజ్, భారతి నగర్ డివిజన్ ప్రెసిడెంట్ బూన్, జగన్నాథ రెడ్డి, వెంకట్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



## కుస్తీ పోటీ విజేతలకు సన్మానం

సికింద్రాబాద్,విశాలభారతి: మారుతి వ్యాయామశాలలో వ్యాయామం చేస్తూ రాష్ట్ర స్థాయి,జిల్లా స్థాయిలో జరిగిన కుస్తీ పోటీల లో పాల్గొని గెలుపొందిన పవన్ కుమార్,గణేష్ లను పలువురు ఘనంగా సన్మానించారు.సోమవారం మైలార్ గడ్డలోని మారుతి వ్యాయామశాలలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు. మైలార్ గడ్డ మారుతి వ్యాయామశాలలో వ్యాయామం చేస్తూ ఈ కుస్తీ పోటీల్లో పాల్గొన్నట్టు సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మారుతి వ్యాయామశాల సభ్యుడు మాది రెడ్డి జలంధర్ రెడ్డి మాట్లాడుతూ మైలార్ గడ్డలోని మారుతి వ్యాయామశాలకు చాలా చరిత్ర ఉందని అన్నారు.ఈ వ్యాయామశాల 1946లో ప్రారంభం అయిందని, వ్యాయామశాలలో ఎంతో మంది వ్యాయామ చేసి జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో బాడీ బిల్డింగ్ పోటీలలో మెడల్స్ సాధించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో మొదటి వ్యాయామశాలలో సోమవారం జరిగిన కుస్తీ పోటీలలో పవన్ కుమార్, గణేష్ లు పాల్గొన్నారు. మైలా ర్ గడ్డ ప్రాంతంలో నివసించే వీరు జిల్లా స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో మెడల్స్ సాధించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇరువురికి వ్యాయామశాల నిర్వాహకులు కుమార్, జలంధర్ రెడ్డి, గౌడ్ శ్రీను, , బ్యాంక్ రమేష్, హరీష్, శ్రీనివాస్, మాస్టర్ జగపతి, బుచ్చన్న, శంకర్ రావు, బుద్ధులన్న, ప్రతాప్, వినోద్ లు ఘనంగా సన్మానించారు. వీరిని ఆదర్శంగా తీసుకొని వ్యాయామశాలలో ఎంతో మంది యువకులకు రాణించాలన్నారు.

## భద్రతకు భాగస్వాములు కావాలి

- నిఘా నేత్రాలకు దాతల సహకారం కావాలి
- కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి పిలుపు

విశాలభారతి,భీమదేవరపల్లి: మండలాన్ని నేరాల నుండి నేర రహిత మండలంగా చేయాలంటే పోలీసులపై మాత్రమే భద్రత భారం మోపడం కాకుండా, ప్రజల సహకారం అవసరమని కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి సోమవారం స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్, వంగర పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న 40 గ్రామాలలో ప్రజల



భాగస్వామ్యంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో దాతలు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. "ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమైన పని చేస్తుంది. ఇవి నేరాలను అరికట్టడంలో, నిందితుల గుర్తింపులో కీలకంగా మారతాయి. ప్రతి గ్రామంలోనూ కనీసం కొన్ని కెమెరాలు ఏర్పాటు అయితే, మన ప్రాంతాన్ని క్రిమినల్ రహిత మండలంగా మార్చవచ్చు," అని ఆయన పేర్కొన్నారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సామాజిక సేవా సంస్థలు, స్వచ్ఛంద దాతలు కలిసి ఈ భద్రతా కార్యక్రమానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఇప్పటికే కొన్ని గ్రామాలలో స్వయంగా ప్రజలు నిధులు సమకూర్చి కెమెరాలు ఏర్పాటు చేసిన ఉదాహరణలు ఉన్నాయని తెలిపారు.

**సమాజ భద్రత మన బాధ్యత**

ఏసీపీ ప్రశాంత్ రెడ్డి చెప్పిన విధంగా - "పోలీసులు చేస్తున్న కృషికి తోడు ప్రజలు కూడా ముందుకు వచ్చినపుడే సమాజ భద్రత బలపడుతుంది. పిల్లల భవిష్యత్తు కోసం, మన గ్రామాల్లో శాంతి కోసం ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాల ఏర్పాటుకు తమ వంతు చేయూతనివ్వాలి." ఈ కార్యక్రమంలో పులి రమేష్, ముల్కనూర్ వంగర ఎస్సైలు సాయిబాబు, దివ్య, ప్రొబేషనరీ ఎస్సై శ్రావణ్ కుమార్, ఏఎస్ఐ సంపత్, మల్లెల నాగేశ్వరరావు, రైటర్ మోహన్ బాబు, రాజు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
మంగళవారం,
10.06.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


vishalabharathi Telugu Daily

## 20న ఎల్బీ స్టేడియంలో యోగా వేడుకలు

విశాలభారతి, స్టేట్ బ్యూరో:యోగా ప్రాధాన్యాన్ని గుర్తించిన ఐక్యరాజ్య సమితి జూన్ 21ని అంతర్జాతీయ యెగా దినోత్సవంగా ప్రకటించి పదేళ్లు నిండుతున్న సందర్భంగా ఈ నెల 20న ఎల్బీ స్టేడియంలో యోగా ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. యోగా వేడుకలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందని అన్నారు. 20న ఉదయం 5 గంటలకు నిర్వహించే వేడుకల్లో అందరూ భాగస్వాములు కావాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో యోగా వేడుకల సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని ప్రకటించి 50 ఏళ్లు నిండుతున్న సందర్భంగా నాటి చీకటి రోజుల వాస్తవాలను, ప్రజలు పడిన ఇబ్బందులను నేటి యువతకు తెలియజేయడానికి విస్తృతంగా సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమర్జెన్సీని వ్యతిరేకించిన జాతీయ వాదులను ప్రభుత్వం చిత్రహింసలకు గురిచేసి జైల్లో పెట్టిందని, ఆ చీకటి రోజులను ప్రజలు నేటికీ మరచిపోలేదని చెప్పారు. మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టి 11 ఏళ్లు నిండుతున్న సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.





# అభివృద్ధి నిరంతర ప్రక్రియ

- ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

విశాలభారతి,రాజేందర్ నగర్: అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పేర్కొన్నారు. బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ లో ఆయన సోమవారం రూ. 5 కోట్ల 81 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్డు వెడల్పు పనులకు శకుస్థాపన చేశారు 12 వ వార్డ్ లోని పోలీస్ అకాడమీ వద్ద,6 వార్డ్ సన్ సిటీ బాలాజీ పాపాలాల్ వద్ద యుజీడి, 1వార్డ్ లోని తిరుమల హిల్స్, శ్రీనివాస నగర్, ఇంద్రారెడ్డి కాలనీలో, విగ్నేశ్వరా కాలనీ, కేకె నగర్ ఫేస్2, వెంకటేశ్వర కాలనీ, శివా సాయి నగర్,1,2, విష్ణుప్రియ కాలనీ లలో యు జి డి , వీడీసీసీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. బండ్లగూడ మున్సిపాల్ కార్పొరేషన్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. ఇది వరకు కాలనీలలో సీసీ రోడ్డు, డ్రైనేజీలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని, ఇప్పుడు మౌలిక వసతులకు సంబంధించిన అన్ని పనులు వేగంగా జరుగుతున్నాయని తెలియజేశారు. వచ్చే నాలుగేళ్లలో మున్సిపాలిటీ రూపురేఖలు మారుస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర, ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



# పార్కు స్థలాన్ని కాపాడండి

- అక్రమంగా నిర్మించిన భవనాన్ని కూల్చివేయండి
- చార్మినార్ జోనల్ కమిషనర్ కు బీజేవైఎం నేత మాగాని శివకుమార్ ఫిర్యాదు

విశాలభారతి,రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ గ్రీన్ సిటీ కాలనీలో పార్కు స్థలాన్ని కబ్జా చేసి భవనాన్ని నిర్మించారని బీజేవైఎం నేత మాగాని శివకుమార్, చార్మినార్ జోనల్ కమిషనర్ కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని మాగాని శివకుమార్ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్నకు విజ్ఞప్తి చేశారు. ఓ వ్యక్తి వెంచర్ లో లే అవుట్ లో పార్కు కోసం వదిలిన స్థలాన్ని కబ్జా చేసి రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి అధికారుల నుంచి అక్రమంగా భవన నిర్మాణం కోసం పర్మిషన్ తీసుకున్నారని జోనల్ కమిషనర్ కు వివరించారు. పార్కు స్థలాన్ని దర్జాగా కబ్జా చేసి నిర్మాణం చేపట్టారని తెలియజేశారు. ఈ విషయంలో జిహెచ్ఎంసి అధికారులు సత్వరమే స్పందించి నిర్మాణ పర్మిషన్ను రద్దుచేసి పార్కు స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కోట్లు విలువ చేసే స్థలాన్ని కబ్జా చేశారని ఆరోపించారు. స్థలాన్ని కబ్జా చేసిన వ్యక్తి నకిలీ ఎల్ఆర్ఎస్ పత్రాలు సృష్టించారని ఈ సందర్భంగా మాగాని శివకుమార్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.



# వివాహిత హత్య కేసులో నిందితుడి అరెస్ట్

- సుమలతను గొడ్డలితో నరికి హత్య చేసిన గుళ్ళ రాజు



విశాలభారతి,భీమదేవరపల్లి: భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ గ్రామంలో జూన్ 5న జరిగిన దారుణ హత్య కేసును పోలీసులు వేగంగా ఛేదించారు. గ్రామానికి చెందిన గుళ్ళ రాజును అరెస్టు చేసినట్లు కాజీపేట ఏసిపి పింగిలి ప్రశాంత్ రెడ్డి వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం, మృతురాలు కోల సుమలత గతంలో గుళ్ళ రాజుతో కుటుంబ వివాదాల నేపథ్యంలో తరచూ గొడవలు పడుతున్నది. రాజుపై ఆమె బావ కోల సంపత్‌ను గాయపరిచిన కేసులో ప్రధాన సాక్షిణిగా నిలిచిన సుమలతను పలుమార్లు బెదిరించినా ఆమె రాజీ పడలేదు. ఇటీవల జరిగిన మరొక హత్యాయత్నం కేసులోనూ సాక్షిగా ఉన్న సుమలతను తొలగించాలని ఉద్దేశించిన గుళ్ళ రాజు, జూన్ 5న మధ్యాహ్నం సుమలత ఒంటరిగా ఇంటి వద్ద ఉన్న సమయంలో గొడ్డలితో తలపై దాడి చేసి అక్కడికక్కడే హత్య చేశాడు. పేరును, నేరాలను కప్పిపుచ్చేందుకు మృతురాలి ఫోన్ తీసుకుని పారిపోయిన నిందితుడిని డీసీపీ సలీమా ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు ముల్కనూర్ శివారు సమ్మక్క సారలమ్మ కమాన్ వద్ద పట్టుకున్నారు. విచారణలో నేరం అంగీకరించిన గుళ్ళ రాజు వద్ద హత్యకు ఉపయోగించిన గొడ్డలి, సెల్‌ఫోన్, కాల్చిన బట్టల్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనను ఛేదించడంలో ప్రధాన పాత్ర పోషించిన ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ముల్కనూర్ ఎస్సై సాయిబాబు, వంగర ఎస్సై దివ్యలను ఏసిపి ప్రశాంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.






# బహుజనుల సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది

- రాజకీయంగా ఎదిగినప్పుడే బీసీలకు గుర్తింపు
- బీసీ కుల గణన ఫలాలను వినియోగించుకుందాం
- కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్..
- శివనగర్ లో 15 లక్షల సొంత నిధులతో ని ముదిరాజ్ భవనం నిర్మాణం
- ప్రారంభించిన నీలం మధు ముదిరాజ్

పటాన్ చెరు,విశాలభారతి బహుజనుల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. సోమవారం పటాన్ చెరు నియోజకవర్గం జిన్నారం మండలం శివనగర్ గ్రామంలో నీలం మధు తన సొంత నిధులు 15 లక్షలు వెచ్చించి నిర్మించిన ముదిరాజ్ సంఘం నూతన భవనాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా నీలం మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం బహుజనులకు అందులో ముఖ్యంగా ముదిరాజ్ లకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చి గౌరవిస్తున్నారని తెలిపారు. గతంలో ప్రభుత్వాలు ముదిరాజ్ లను కేవలం ఓటు బ్యాంకు గా చూస్తే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముదిరాజ్ లను పాలనలో భాగస్వాములను చేశారని తెలిపారు. అందుకు ముదిరాజ్ బిడ్డ వాకిటి శ్రీహరి ముదిరాజ్ ను మంత్రి వర్గంలోకి తీసుకోవడం ఉదాహరణ అని కొనియాడారు. కాంగ్రెస్ చేపట్టిన బీసీ కులగణన ను బీసీలందరూ వినియోగించుకోవాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బహుజనులు రాజకీయంగా బలపడాలని సూచించారు. మనలో రాజకీయ చైతన్యం వస్తేనే మన బిడ్డలు రాజకీయంగా బలపడితేనే మన జాతులకు గుర్తింపు వస్తుందని స్పష్టం చేశారు. ముదిరాజ్ ల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడానికి ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లానని త్వరలో ఆ సమస్యలు పరిష్కారం చేసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు వీర్నల సత్యనారాయణ,ఆత్మ కమిటి చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కుంచల ప్రభాకర్, మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు వడ్డే కృష్ణ,మాజీ ఎంపీటీసీ మహేష్, నీరుడి కృష్ణ, నర్సింలు, అశోక్, అన్వర్ పటేల్, మహేష్, శ్రీనివాస్, జాకీ, మల్లేష్, నర్సింలు, కాంగ్రెస్ శ్రేణులు, సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# దళితరత్న అవార్డు గ్రహీత పడమటింటి యేసు



దేవరుప్పుల, విశాలభారతి: మండలం కడవెండి గ్రామానికి చెందిన దళిత ఉద్యమ నాయకులు, సామాజిక సేవకులు పడమటింటి యేసు పాదం కు దళిత రత్న అవార్డు వరించింది. ఆయన నేపథ్యం బాల్య విద్యాభ్యాసం చేస్తున్న రోజులలోనే భారతదేశ స్వతంత్ర సమరయోధులను స్మరిస్తూ.. మహాత్మా జ్యోతిరావు, సావిత్రి బాయి పూలే, ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ల ఆలోచన విధానంతో వారి త్యాగాలకు ఆకర్షితులై, వారి స్ఫూర్తితో నాటి నుంచి నేటి వరకు దళితులు బడుగు బలహీన వర్గాలకు చెందిన బహుజనుల పట్ల జరుగుతున్న అన్యాయాలను, వారిపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ, ఎక్కడ అన్యాయం జగిగితే అక్కడ ఎదురు నిలబడి పోరాటం చేస్తున్న దళిత నాయకులు పడమటింటి యేసు పాదం మాదిగ ప్రస్థానాన్ని గుర్తించి తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జేసిఎస్ వల్లూరి ఫౌండేషన్ ప్రగతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవార్డును అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా యేసు పాదం మాట్లాడుతూ తెలంగాణ ఎమ్మార్పీఎస్ సంఘంలో ఒక రాష్ట్ర నాయకుడిగా, దళిత బహుజనుల పట్ల నేను చేసిన పోరాటాలు, ఆరాటాలు గుర్తించి నాకు ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని, నా దళిత బహుజనుల పట్ల నా కంఠంలో ఊపిరి ఉన్నంతవరకు పోరాడుతానని హామీ ఇచ్చారు. ఆదివారం హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో దళితరత్న అవార్డును ప్రధానం చేసిన నటుడు బాబు మోహన్ జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ చైర్మన్ విఆర్ శ్రీనివాస్ కు ఇతర పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. దళితరత్న అవార్డు అందుకున్న యేసు పాదం ను పలువురు విద్యావంతులు మేధావులు దళిత బహుజన నాయకులు సామాజిక సేవ కార్యకర్తలు గ్రామస్తులు స్నేహితులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.



# ఎర్రబెల్లి మజీద్ ఏ యూసుఫ్ నూతన కమిటీ ఎన్నిక

విశాలభారతి,వేలేరు: ఎర్రబెల్లి గ్రామంలోని మజీద్ ఏ యూసుఫ్‌కు కొత్త కమిటీ ఎన్నికయ్యింది. గ్రామ పెద్దలు, ముస్లిం సోదరుల సమక్షంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీ బాధ్యతలు స్వీకరించింది. ఈ సందర్భంగా మహమ్మద్ రియాజ్ కమిటీ అధ్యక్షుడిగా, మహమ్మద్ ఫరూక్ అబ్దుల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సెక్రటరీగా మహమ్మద్ షబ్బీర్ పాష, వైస్ సెక్రటరీగా మహమ్మద్ ఆసిఫ్, డైరెక్టర్‌గా మహమ్మద్ సమీర్, క్యాషియర్‌గా అస్గర్ అలీ ఎంపికయ్యారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో మస్జిద్‌కు ఇమామ్‌గా మహమ్మద్ షేక్ అలీ, మోజన్‌గా మహమ్మద్ దస్తగిరిని నియమించారు. గ్రామంలో జరిగే శుభాఅశుభ కార్యక్రమాల కోసం హలాల్ (జుబా) చేసే అధికారం ఇమామ్ మరియు మోజన్లకే ఉందని కమిటీ స్పష్టం చేసింది. ఇస్లామిక్ నిబంధనలను పాటించాలని, అవి ఉల్లంఘించిన వారికి కమిటీ నుండి తగిన చర్యలు తీసుకుంటామని కమిటీ సభ్యులు తెలిపారు.

# శ్రీ సత్యదేవ సహిత అయ్యప్ప స్వామి దేవాలయం పదవ వార్షికోత్సవం



చౌటుప్పల్, విశాలభారతి: పట్టణ కేంద్రంలోని శ్రీ సత్యదేవ సహిత అయ్యప్ప స్వామి దేవాలయం పదవ వార్షికోత్సవం సందర్భంగా దేవాలయంలో కరపత్రిక విడుదల చేయడం జరిగింది.తేదీ జూన్ 10, 11, మంగళ బుధవారం రోజులలో శ్రీ సత్యదేవ సహిత అయ్యప్ప స్వామి పదవ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయండి జరిగింది. కార్యక్రమాలు పదవ తేదీ ఉదయం సుప్రభాతం గోపూజ గణపతి పూజ స్వస్థ పుణ్యాహవాచనం ధ్వజారోహణం తదుపరి దేవాలయంలో మూలవిరాట్లకు పంచామృత అభిషేకములు తదుపరి తీర్థ ప్రసాద వితరణ మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ మరియు సాయంత్రం 6 గంటలకు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నాము. అదేవిధంగా పదకొండవ తేదీ బుధవారము ఉదయం సుప్రభాత సేవ ఏడు గంటల 30 నిమిషాలకు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలు హోమము 11 గంటలకు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నాము మరియు సాయంత్రం 6 గంటలకు శ్రీ అయ్యప్ప స్వామి వారికి పంచామృత అభిషేకములు, మహా పడిపూజ భజన కార్యక్రమం తదుపరి అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో ఈ రెండు రోజుల బ్రహ్మోత్సవాలకు అయ్యప్ప భక్తులు దాతలు చౌటుప్పల పట్టణ మరియు మండల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ అయ్యప్ప స్వామి కృపకు పాత్రులు కాగలరని కోరుచున్నాము.ఈ కార్యక్రమంలో దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షులు బొబ్బిళ్ళ మురళి గురు స్వామి,అధ్యక్షులు కామిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, మోగుదాల రమేష్ గౌడ్ సురవి నరసింహా గౌడ్ తిరందాసు జగన్, ఉప్పు ఆంజనేయులు అంతటి రాము గౌడ్ సుక్క సుదర్శన్, కర్నాటి శ్యాం కుమార్,బొడ్డు రాజేందర్ రెడ్డి,ఆలయ అర్చకులు ఓంకార్ శాస్త్రి ఆంజనేయ చారి,కాసోజు మధు తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
మంగళవారం,
10.06.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## పోలీస్ జాగృతి కళాబృందం అవగాహనా కార్యక్రమం



**విశాలభారతి,భీమదేవరపల్లి :** వంగర పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీనగర్ గ్రామంలో సోమవారం పోలీస్ జాగృతి కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ ప్రజలకు డయల్ 100 వినియోగం, గంజా వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన, రోడ్ భద్రత, సైబర్ నేరాలు, బాల్యవివాహాలు, నకిలీ విత్తనాలపై సమాచారాన్ని కల్పించారు. కళాబృందం నాటకాల రూపంలో ప్రజల్లో చైతన్యం కలిగిస్తూ సందేశాత్మకంగా కార్యక్రమాన్ని నిర్వహించింది. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని వినియోగించుకున్నారు. పోలీస్ శాఖకు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.

# సహాయ పరికరాల దరఖాస్తూ గడువు జూన్ 30 వరకు పొడగించాలి

- నోటిఫికేషన్ సవరించకుంటే ఆందోళన చేస్తాం
- ఎన్ పిఆర్డీ నారాయణపేట్ జిల్లా కమిటీ

**నారాయణపేట, విశాలభారతి:**



వికలాంగులు సహాయ పరికరాల పొందేందుకు దరఖాస్తు గడువు జూన్ 30 వరకు పొడగించాలని, ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ సవరించకుంటే ఆందోళన చేస్తామని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నారాయణపేట జిల్లా కమిటీ హెచ్చరిస్తోందని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా సహాయ పరికరాలు మంజూరు చేయాలని నిర్ణయించడం పట్ల NPRD నారాయణపేట్ జిల్లా కమిటీ హర్షం ప్రకటిస్తుంది, కానీ టీవీసీసీ /సి1/119/2024 నోటిఫికేషన్ తేదీ 06.06.2025 నాడు విడుదల చేసినారు.ఇందులో 07.06.2025 నుండి 18.06.2025 తేదీ వరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసిన వారికి మాత్రమే పరికరాలు మంజూరు చేయాలని నిర్ణయం చేయడం సరైంది కాదు.కేవలం 11 రోజుల వ్యవదిలో దరఖాస్తుకు అవసరం అయిన సర్టిఫికెట్స్ తీసుకోవడం సాధ్యం కాదనే విషయాన్ని అధికారులు గుర్తించాలి.35 కోట్ల రూపాయలతో పరికరాలు ఇవ్వాలని నిర్ణయం చేసిన అధికారులు దరఖాస్తు చేసుకోవడానికి కనీసం 30 రోజుల సమయం అయిన ఇవ్వాలి.11 రోజుల కాలపరిమితి పెట్టడం అంటే లబ్ధిదారులకు అన్యాయం జరిగే అవకాశం ఉంది. ఆన్లైన్లో దరఖాస్తూ చేయాలనే నిబంధన వలన గ్రామీణ ప్రాంతంలో ఉన్న వికలాంగులకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉంది. దరఖాస్తులు ఆన్లైన్ తో పాటు ఆఫ్ లైన్ లో కూడా స్వీకరించేందుకు చర్యలు తీసుకోవాలి.పరికరాల కోసం అనేక నెలల నుండి ఎదురుచూస్తున్న వికలాంగులకు అధికారుల నిర్ణయం వలన నష్టం జరిగే అవకాశం ఉంది.తక్షణమే ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ ను సవరించాలని,దరఖాస్తు గడువు కనీసం జూన్ 30 వరకు పొడగించాలని,అఫ్ లైన్ లో కూడా దరఖాస్థులు స్వీకరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎన్ పిఆర్ఆర్డి నారాయణపేట్ జిల్లా కమిటీ కోరుతుంది. అధికారులు సానుకూలంగా స్పందించాలని కోరుతున్నాము.టీవీసీసీ చైర్మన్ ముత్తినేని వీరయ్య గారు తక్షణమే జోక్యం చేసుకోవాలని,నోటిఫికేషన్ సవరించే విదంగా అధికారులు,ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని కోరుతున్నాము.సహాయ పరికరాల దరఖాస్తు కోసం అవసరం అయిన సమయాన్ని లబ్ధిదారులకు కేటాయించాలని లేకుంటే లబ్ధిదారులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరిస్తుంది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో కే కాశాప్ప జిల్లా ప్రధాన కార్యదర్శి, బాలరాజ్ జిల్లా సహాయక కార్యదర్శి, వి బస్వారాజ్ జిల్లా సహాయక కార్యదర్శి,సంజీవ్ జిల్లా నాయకులు మరియు నారాయణపేట్ మండల అధ్యక్షులు పాల్గొన్నారు.



## సమున్నత వ్యక్తిత్వం, సౌశీల్యమును విద్యార్థులలో పెంపొందించాలి

- మధుసూదన్ రెడ్డి ఏసీపి

**చౌటుప్పల, విశాలభారతి:**

పట్టణ కేంద్రంలో బడుగు రామస్వామి కమలమ్మ ఫౌండేషన్, పాలకుర్ల శివయ్య గౌడ్ స్మారక ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అత్యద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాన దీప్తి పురస్కారములను ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన చౌటుప్పల అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పి.మధుసూదన్ రెడ్డి చేతుల మీదుగా జ్ఞాన దీప్తి పురస్కారములను అందజేయడం జరిగినది.జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరియు మోడల్ స్కూల్ లలో కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలల్లో ప్రతిభ కనబరిచిన 30 మంది విద్యార్థులకు పురస్కారాలు అందజేయడం జరిగినది.ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఉన్న సౌకర్యాలను తమ అనుకూలంగా మలుసుకొని ప్రతిభ ను ప్రదర్శించాలన్నారు. చిన్నతనం నుండి చదువులపై ఏకాగ్రత సాధించి ఉన్నత స్థానాలు పొంది పుట్టిన జన్మభూమికి పేరు తేవాలన్నారు. అందుకొరకు సమున్నత వ్యక్తిత్వమును సౌశీల్యమును పెంపొందించుకోవాలన్నారు. ఆకర్షణలకు దూరంగా ఉండి మొబైల్ ఫోన్ల వినియోగాన్ని తగ్గించాలన్నారు.బడుగు రామస్వామి కమలం ఫౌండేషన్ చైర్మన్ బడుగు శ్రీరాములు మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు పై శ్రద్ధ తగ్గించి సహజ మేధస్సు పెంపొందించుకోవాలని అన్నారు.పాలకూర శివయ్య గౌడ్ స్మారక ఫౌండేషన్ చైర్మన్ పాలకూర మురళి గౌడ్ మాట్లాడుతూపల్లెల నుండి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం కావాలని దాని కొరకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు నెలలకు ఒకసారి ఉచిత అవగాహన శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో దబ్బాటి శేఖర్, అక్షయ,పోలోజు రాజు వెంకటాచారి పిల్లల తల్లిదండ్రులు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాలికల విద్యాలయంలో సీట్లు భర్తీ ఎంపిక పూర్తి

- హెచ్.ఎం శకుంతల

**పినపాకా విశాలభారతి:**



2025 26 విద్యా సంవత్సరంలో మినీ గురుకులం పినపాక నందు ఒకటో తరగతి అడ్మిషన్స్, రెండు, ఐదు తరగతుల బ్యాక్లాగ్ పోస్టులను నింపుటకు ది 9. 6. 2025 సోమవారం డ్రా పద్ధతిలో ఎంపిక చేయడమైనది. ఒకటో తరగతిలో 30 మంది, రెండో తరగతిలో ఒక్కరు, 5 తరగతిలో 11 మంది విద్యార్థులను సెలెక్ట్ చేయడమైనది. సెలెక్ట్ అయిన విద్యార్థులను ది 12.6.25 నుండి కుల మరియు ఆదా య సర్టిఫికెట్లతో వచ్చి అడ్మిషన్ తీసుకోవాల్సిందిగా విద్యార్థులను కోరడమైనది. ఈ కార్యక్రమాన్ని సెలక్షన్ కమిటీ వారు సజావుగా నిర్వహించడమైనది. ఈ కార్యక్రమాన్ని శ్రీమతి బి. అరుణకుమారి రీజినల్ కోఆర్డినేటర్ ఖమ్మం వారు దగ్గరుండి నిర్వహించారు. అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శ్రీ కె నరేందర్, లైజెన్ ప్రిన్సిపల్ రాణి , పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీమతి ఎం. శకుంతల, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ జిల్లా హాస్పిటల్ ను జిల్లా కేంద్రంలోనే కొనసాగించాలి

- కలెక్టర్ కు విన్నవించినసిపిఎం నాయకులు

**నారాయణపేట, విశాలభారతి:**

ప్రజలకు అన్ని విధాలుగా అనువుగా ఉండి వైద్య సేవలకు అనుకూలంగా ఉన్న ప్రభుత్వ జిల్లా హాస్పిటల్ ను పట్టణానికి దూరంగా 13 కిలోమీటర్ల దూరంలో గడ్డమీది అప్పక్ పల్లి గ్రామానికి తరలించడం అన్యాయమని సిపిఎం జిల్లా కార్యదర్శి జి వెంకట్రామిరెడ్డి ,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం అన్నారు.సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా కలెక్టర్ శ్రీమతి సిక్తా పట్నాయక్ కి సోమవారం రోజు వినతిపత్రం అందజేశారు. అత్యవసర వైద్య సేవలు కూడా అందుబాటులో లేకపోవడంతో అత్యధిక జనాభా కలిగిన ఉన్న నారాయణపేట పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. తక్షణమే జిల్లా ప్రభుత్వ హాస్పిటల్ నారాయణపేట జిల్లా కేంద్రానికి మార్చాలని అన్నారు.ఇప్పుడున్న భవనం పాతది కావడంతో తప్పని పరిస్థితిలో హాస్పిటల్లో తరలించాల్సి వచ్చిందని కలెక్టర్ తెలుపగా సిపిఎం నాయకులు కలగజేసుకొని నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో దాదాపుగా ఎనిమిది కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనం నిరుపయోగంగా ఉన్నదని ఈ భవనంలో ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని కొనసాగించవచ్చని అన్నారు.గత ప్రభుత్వ పెద్దల అనాలోచిత నిర్ణయం అహంకారపూరిత వైఖరితో అత్యవసర వైద్య సేవలు ప్రజలు అందుకోవడానికి అనేక ఇబ్బందులకు గురి చేసిందన్నారు.గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను నేటి ప్రభుత్వము సరిచేసి ప్రజలకు అనుకూలమైన విధానాలను కొనసాగించాలని కోరారు. అదేవిధంగా ప్రభుత్వ వ్యవసాయ పాలిటెక్నిక్ కాలేజీ కూడా వనపర్తికి తరలిస్తున్నారని దానిని అడ్డుకోవాలని యధావిదంగా నారాయణపేటలోనే కొనసాగించాలని కలెక్టర్ ని కోరారు. కలెక్టర్కు వినతిపత్రం అందజేసిన వారిలో సిపిఎం నాయకులు కాశప్ప, నరహరి,తదితరులు ఉన్నారు.



## ప్రజావాణికి 32 ఫిర్యాదులు

**నారాయణపేట, విశాలభారతి:**

ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 32 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.అర్జీదారుల దరఖాస్తులలో పేర్కొన్న సమస్యలపై క్షుణ్ణంగా పరిశీలించి,వెంటనే పరిష్కరించుటకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ రోజు ప్రజావాణి కార్యక్రమంలో 32 దరఖాస్తులు స్వీకరించగా వాటిని వెంటనే సంబంధిత అధికారులకు బదిలీ చేసి పరిష్కరించాలని ఆదేశించారు .ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ సంచిత్ గంగ్వర్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## వాకిటికి అమాత్య హోదా.. ముదిరాజుల సంబరాలు

**నారాయణపేట, విశాలభారతి:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి తన మంత్రివర్గంలో చోటు కల్పించడంపై నారాయణపేట జిల్లా కేంద్రంలో సోమవారం ముదిరాజ్ సంఘం నాయకులు ప్రజలు సంబరాలు చేసుకున్నారు.పట్టణంలోని సత్యనారాయణ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు సరఫ నాగరాజ్ మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షులు ఏకాంత కుమార్లు మాట్లాడారు.గత పార్లమెంట్ ఎన్నికల్లో నారాయణపేట బహిరంగ సభలోముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముదిరాజులకు మంత్రి పదవి ఇస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేస్తూ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇవ్వడంతో హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మిర్చి వెంకటయ్య, కోనంగేరి పోషల్ రాజేష్,హనుమంతు కాకర్ల భీమయ్య,మారుతి,కార్తీక్ ,అప్పి రెడ్డి పల్లి రాము, శేషప్ప, మల్లేష్,జూన్ వెంకటేష్,గోవిందు, కె.రాములు,లక్ష్మణ్ ఎల్ఐసి తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలి

**నారాయణపేట, విశాలభారతి:**

వేసవి సెలవులు ముగించుకుని తిరిగి ప్రారంభం అవుతున్న వేళ పాఠశాల మరియు కళాశాల విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని బీజేవైఎం పట్టణ శాఖ ఆధ్వర్యంలో డీఈవో, డిఐఈవో, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.దీని విషయమై బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు జాజాపూర్ మణిశంకర్ మాట్లాడుతూ విద్యార్థులకు శుభ్రమైన తాగునీటి వ్యవస్థ,పరిసరాలు శుభ్రంగా మరియు తరగతి గదుల్లో మరియు పరిసర ప్రాంతాల్లో శానిటైజేషన్ చేయాలని, ఎక్కడైనా పాఠశాలల్లో మరమ్మత్తులు చేయించాల్సి ఉంటే వాటిని తక్షణమే పూర్తి చేసి వర్షాకాలంలో నీరు కారే పరిస్థితి రాకుండా చూసుకోవాలని సూచించారు.విద్యాశాఖ అధికారులు కూడా దీనికి సానుకూలంగా స్పందించడం జరిగింది.విద్యార్థులకు కావలసిన సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు.




## సీజన్ వ్యాధులపై అవగాహన సదస్సు

**వాజేడు,విశాలభారతి:**

వాజేడు మండల పరిధి పేరూరు గ్రామంలో మహిళా సంఘాలకు కాపేడు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సీజన్ వ్యాధులపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్ ఓ పి వేణుగోపాల కృష్ణ సీజన్ వ్యాధులపై ప్రజలకు వచ్చే వ్యాధుల గురించి మహిళా సంఘాలకు అవగాహన కల్పిస్తూ.సీజనల్ వ్యాధులు అంటే, నిర్దిష్ట కాలంలో లేదా సీజన్‌లో మరింతగా వచ్చే వ్యాధులు. వర్షాకాలంలో వచ్చే జలుబు, జ్వరం, డయేరియా, టైఫాయిడ్ వంటివి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఏదైనా అనారోగ్య సమస్య ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి అని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో వాజేడు మండల కాప్రేడ్ స్వచ్ఛంద సంస్థ యానిమేటర్ కామేశ్వరరావు, పేరూరు యానిమేటర్ కె ప్రసాదు, వివో ఏ సరిత, గ్రామ సమైక్య అధ్యక్షురాలు ఉత్తరమ్మ, గ్రూప్ సంఘ సభ్యులు మరియు ఆశ వర్కర్స్ ప్రజలు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

మంగళవారం,
10.06.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com

8

vishalabharathi Telugu Daily

GENERAL NEWS


## శతాదిక వృద్ధురాలు మృతి



- మూడు తరాలను చూసి ఆమ్మ

ఆర్మూర్,విశాలభారతి: నవిపేట్ మండలం నాళేశ్వర్ గ్రామానికిచేందిన శతాదిక వృద్ధురాలు పుప్పాల బుచ్చక్క (108) సోమవారం తెల్లవారుజామున మృతి చెందింది,బుచక్క మూడు తరాల వారసులను కండ్లరా చుసినట్లు కుటంబీకులు తెలిపారు. వారం రోజుల క్రితం వరకు పనులు చేసుకుంటు, ఏటువంటి కాళ్ల,కిళ్ల నొప్పులు,లేకుండా పూర్తిగా ఆరోగ్యంగా ఉండేదన్నారు,ఆయితే బుచ్చవ్వ కు ముగ్గురు కోడుకులు, ఓక కూతురు ఉన్నారన్నారు.



## కాంగ్రెస్ పార్టీ తోనే సామాజిక న్యాయం సాధ్యం

- యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్.

సూర్యాపేట, విశాలభారతి:
కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం సాధ్యమని యూత్ కాంగ్రెస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ అన్నారు. సోమవారం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి, ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్ ల ఆదేశాలతో జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ సమీపంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎఐసిసి అధ్యక్షులు ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ గాంధీతో పాటు మంత్రివర్గ సభ్యుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎలిమినేటి అభినయ్ మాట్లాడుతూ దేశ, రాష్ట్ర రాజకీయాల్లో సామాన్య కార్యకర్తలు, నాయకులకు కుల, మతాలకు అతీతంగా కాంగ్రెస్ పార్టీ ఉన్నతమైన పదవులను కట్టబెట్టిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీలో అన్ని కులాలు, మతాల వారికి సమానమైన ప్రాధాన్యత లభిస్తుందన్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో కాంగ్రెస్ పార్టీ పాటించిన సామాజిక న్యాయం దేశ రాజకీయాలకు ఆదర్శంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు అంజద్ అలీ, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మాజీ పార్లమెంటరి నియోజకవర్గ అధ్యక్షులు కుమ్మరికుంట్ల వేణుగోపాల్, చింతమళ్ళ రమేష్, లక్ష్మణ్ గౌడ్, కుంభం రాజేందర్, రుద్రంగి రవి,పట్టణ అధ్యక్షులు బొడ్డు సాయి, నూతనకల్ మండల అధ్యక్షులు అశోక్, నాగారం మండల అధ్యక్షులు వలీ, యూత్ కాంగ్రెస్ నాయకులు చింత సుధీర్, రవి, లక్ష్మణ్, ఎస్. శివ పాల్గొన్నారు.

# ప్రజవాణి దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి..

- ప్రజలకి సేవ చేయటమే ఉద్యోగుల భాద్యత.
- భూ సమస్యల కొరకు రెవిన్యూ సదస్సులు వినియోగించుకోవాలి.
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



సూర్యాపేట,విశాలభారతి:
రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి పరిష్కరించాలని అధికారులకి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ పి. రాంబాబుతో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకి సేవ చేయటమే ఉద్యోగుల భాద్యత అని, అధికారులు ప్రజల కొరకు అందుబాటులో ఉండి పని చేయాలని ఒకవేళ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. జిల్లా స్థాయి అధికారులు సిబ్బందితో సమావేశం నిర్వహించి విధులు , రిజిస్టర్ ల నిర్వహణ, ఫైల్స్ సరైన పద్ధతిలో నిర్వహించెందుకు దిశా నిర్దేశం చేయాలని సూచించారు. భూ సమస్యలకి సమబందించిన ధరఖాస్తులు సమర్పించేందుకు జిల్లా స్థాయి ప్రజావాణి కి రావాల్సిన అవసరం లేదని జూన్ 20 వరకు ప్రతి గ్రామం లో రెవిన్యూ అధికారులచే రెవిన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని, భూ సమస్యలు ఏమైనా ఉంటే ఆ గ్రామాలలో జరిగే రెవిన్యూ సదస్సులు లో అన్ని డాక్యుమెంట్స్ జత చేసి ధరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓపిడి వి.వి అప్పారావు, డిఇఓ అశోక్, డి పి ఓ యాదగిరి,సిపిఓ కిషన్,డి డబ్ల్యూ ఓ నరసింహారావు, డి సి ఓ పద్మ, వెల్ఫేర్ డీఎవో శ్రీధర్ రెడ్డి,సంక్షేమ అధికారులు శంకర్,శ్రీనివాస్ నాయక్, జగదీశ్వర్ రెడ్డి, అధికారులు, సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు.



## లంబాడి జాతిని ఏకతాటిపై వచ్చి సంఘాన్ని బలోపేతం చేయాలి

- ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ సపావత్ రాములు నాయక్
- ఏఐబిఎస్ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షులుగా గుగులోతు నాగు నాయక్ నియామకం

సూర్యాపేట,విశాలభారతి:
లంబాడి జాతిని ఏకతాటిపై తీసుకువచ్చి ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ బలోపేతం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ సపావత్ రాములు నాయక్ సూచించారు. సోమవారం హైదరాబాదులోని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర కార్యాలయంలో సూర్యాపేట జిల్లా అధ్యక్షులుగా చివ్వెంల మండలం సేవాలాల్ తండాకు చెందిన గుగులోతు నాగు నాయక్ ను నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతి ఐక్యం చేస్తే అన్ని హక్కులను సాధించవచ్చు అని అన్నారు. సూర్యాపేట జిల్లాలో సంఘాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని, సీనియర్ నాయకుల సలహాలు, సూచనలను పాటిస్తూ ముందుకు సాగాలని సూచించారు. అనంతరం నూతనంగా ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షులుగా నియామకమైన గుగులోతు నాగు నాయక్ మాట్లాడుతూ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాములు నాయక్ ఆదేశాలతో సంఘాన్ని జిల్లాలో బలోపేతం చేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాములు నాయక్, సీనియర్ నాయకులు లూనావత్ పాండు నాయక్, ధరావత్ వీరన్న నాయక్, మంగ్తియ నాయక్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుగులోతు వీరన్న నాయక్, ధరావత్ రాము నాయక్ పాల్గొన్నారు.




## ధర్మసాగర్ నార్త్ కెనాల్ పనులు వేగవంతం చేయాలి

- కిసాన్ మోర్చా నేత తీగల రాజు

విశాలభారతి,భీమదేవరపల్లి:
ధర్మసాగర్ రిజర్వాయర్ నుండి వచ్చే నార్త్ కెనాల్ ద్వారా దేవునూరు, దామెర, ముల్కనూర్, కొప్పూరు, మాణిక్యపూర్, కాట్రపల్లి, పెంచికలపేట గ్రామాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. ప్రస్తుతం కెనాల్ ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్, చెట్లు తొలగింపు పనులు జరుగుతుండగా, రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే 18వ కిలోమీటరు నుండి 23వ కిలోమీటర్ వరకు పనులు ఇంకా పూర్తి కాలేదని మండల కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు తీగల రాజు తెలిపారు. గతంలో నీటి లభ్యత లోపంతో యాసంగి పంటలు నష్టపోయాయని గుర్తు చేస్తూ, చివరి దాకా క్లియరెన్స్, లైనింగ్ పనులు పూర్తి చేయాలని అధికారులు కోరారు.




## రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించండి..

- పోటు లక్ష్మయ్య, బొడ్డు శంకర్
- ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు.

సూర్యాపేట,విశాలభారతి:
ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్నందున రైతులకు సరిపడా నాణ్యమైన విత్తనాలు సప్లై చేయాలని, నకిలీ విత్తనాలు అరికట్టాలని సోమవారం సూర్యాపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోటు లక్ష్మయ్య, బొడ్డు శంకర్ లు పాల్గొని మాట్లాడుతూ తొలకరి సీజన్ ప్రారంభమైందని,జిల్లాలో 6.75 లక్షల ఎకరాలలో పంటలువేస్తున్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు కానీ నేటికీ రైతులకు సరిపడా విత్తనాలు అందించలేదన్నారు. ప్రైవేటు విత్తన సంస్థ వ్యాపారులు, నకిలీ విత్తనాలతో రైతులను నిలువు దోపిడీకి గురి చేస్తున్నారని, వారి దోపిడీని అరికట్టి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతు భరోసాను రైతులకు ఇవ్వడంతో పాటు జిల్లాలో ఎస్సారెస్పీ కాలువలకు మరమ్మతులు చేయించి తూములకు లాకులు ఏర్పాటు చేసి లస్కర్లను వెంటనే నియమించాలని, కౌలు రైతులకు బ్యాంకురుణాలు ఇవ్వాలని, రైతులకు యాసంగి పంటకు వెంటనే బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అలుగుబెల్లి వెంకటరెడ్డి, దాసరి శ్రీను, ఐఎఫ్ టి యు జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, ఉపాధ్యక్షులు కునుకుంట్ల సైదులు, అరుణోదయ జిల్లా అధ్యక్షులు ఉదయగిరి. పగిడిమర్రి సోమయ్య, ధర్మాజీ ,సామ నర్సిరెడ్డి, కామల శ్రీను, వీరనాయక్, మారయ్య,గాంధీ, బోనగిరి గిరి బాబు, కట్ల వీరన్న తదితరులు పాల్గొన్నారు.



## పెర్కిట్ పాఠశాలకు బడి బాటలో పెరుగుతున్న అడ్మిషన్లు

ఆర్మూర్ విశాలభారతి:
పెర్కిట్ తెలుగు మీడియం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కోటార్ మూర్ వార్డులలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం ఇంటింటి ప్రచారం చేయగా ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తామని తల్లిదండ్రులు తెలియజేశారు. ఇందులో భాగంగా పదవ తరగతిలో ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థుల ఫ్లెక్సీని ఆర్మూర్ మండల తాసిల్దార్ దశరథ్ కోటార్ మూర్ గ్రామ వీడిసి మరియు ప్రజా ప్రతినిధులు,ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులులతో కలిసి ఫ్లెక్సీనిఆవిష్కరించారు.





## స్నేహ బంధానికి నిలువెత్తు నిదర్శనం

- మృత స్నేహితుడి కుటుంబానికి ₹63,000 ఆర్ధిక సాయం చేసిన పూర్వ విద్యార్థులు

విశాలభారతి,భీమదేవరపల్లి:
మండలంలోని ముస్తఫాపూర్ గ్రామం, కొత్తపల్లె తండాకు చెందిన బానోతు గోపాల్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శ్రీ కృష్ణదేవరాయ హైస్కూల్‌లో కలిసి విద్యనభ్యసించిన స్నేహితులు, గురువులు గోపాల్ మృతితో దిగ్భ్రాంతికి గురై అతని కుటుంబానికి అండగా నిలిచారు. స్నేహితుని కుటుంబాన్ని ఆదుకోవాలని నిర్ణయించుకొని వారు కలసి రూ.63,000 ఆర్థిక సాయం మృతుడి భార్య బానోతు సంగీతకు అందజేశారు. ఈ సందర్భంగా వారు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆపద సమయంలో స్నేహితుడి కుటుంబానికి తోడు నిలవడమే నిజమైన స్నేహమని వారు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా అన్ని విధాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.





## ఉపాధ్యాయుల సర్దుబాటు జీవోను సవరించాలి.

సైదాపూర్ ,విశాలభారతి:
కరీంనగర్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు పేరుతో ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేసే ప్రక్రియ నిలుపుదల చేయాలని ఎస్టీయూ జిల్లా శాఖ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.. జీవో 25ని సవరించాలని, ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయున్ని నియమించాలని, మెరుగైన అభ్యసన వాతావరణం కల్పించాలని జిల్లా శాఖ డిమాండ్ చేసింది స్థానిక కరీంనగర్లోని సాధన స్కూల్లో ఎస్టీయూ 79వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పిఆర్ శ్రీనివాస్ జాతీయ పతాకాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టా రవీంద్ర చారి సంఘపతాకాన్ని ఆవిష్కరించారు అనంతరం వారు మాట్లాడుతూ 79 వసంతాలుగా ఉపాధ్యాయ ఉద్యమమే హక్కుల సాధనకు పరమ మార్గమని భావించిన రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల సాధనలో ముందుందని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ ప్రథమ ప్రాధాన్యంగా సంఘం పనిచేసిందని, నికార్సయిన ఉపాధ్యాయులను నాయకులను సమాజానికి సంఘం అందజేసిందని ఉపాధ్యాయుల్లో పోరాట పటిమను పెంచి విద్యార్థుల జీవితాల్లో వెలుగు నింపిందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు....ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఆర్ శ్రీనివాస్ కట్టా రవీంద్రాచారి జిల్లా ఆర్థిక కార్యదర్శి గుండ శ్రీనివాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పిన్నింటి తిరుపతిరావు రాష్ట్ర బాధ్యులు కొట్టె లక్ష్మణరావు, వెలిచాల వెంకటస్వామి, యెనగంటి బాలాజీ, వివేకానంద చారి,కోట శ్యామ్ కుమార్, రసూల్, వి రవీందర్, తాటిపాముల శ్రీనివాస్, మధిర వేణుగోపాల్, చొప్పదండి రామకృష్ణ, మానుపాటి బుచ్చయ్య, లక్ష్మణాచారి, కందుకూరి శ్రీనివాస్, కరంవీర్, వివిధ మండలాల బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# రియలైజేషన్ స్లోగానే.. మిగతావాళ్లో కూడానా?



వైఫల్యాలు ఎన్నో గుణపాఠాలు నేర్పుతాయి. తదుపరి నిర్ణయాల విషయంలో పదిసార్లు ఆలోచించి తీసుకుంటాం. ఇందుకు ఎవరూ అతీతులు కాదు. అందరూ తప్పులు చేసి ఎదిగిన వారే. ఇటీవలే ఇలాంటి రియలైజేషన్ పూజాహెగ్డే మాటల్లో బయటపడింది. టాలీవుడ్ లో కెరీర్ పీక్స్ లో ఉండగా బాలీవుడ్ అవకా శాలు రావడంతో? ఉన్న అవకాశాలను కూడా వదులుకుని హిదీ పరిశ్రమకు వెళ్లిన సంగతి తెలిసిందే.అక్కడా వరుస వైఫల్యాలు ఎదురవ్వడంతో? ఎక్కువ ఆలోచించకుండ మళ్లీ సౌత లో అవకాశాల కోసం ప్రయత్నాలు మొదలు పెట్టి కొన్నింటిని అందుకుంది. ఇప్పుడిప్పుడే మళ్లీ తమిళ్ లో బిజీ అవుతుంది. హిందీలోనూ కొన్ని సినిమాలు చేస్తోంది. ఏదో ఒక సినిమా తో మంచి కంబ్యాక్ ఇస్తుంది అన్న నమ్మకం ఉంది. ఇదే సమయంలో కొన్ని సినిమాల్లో పాత్రల పరంగా తాను తీసుకున్న నిర్ణయాలు రేసులో వెనక్కి నెట్టనట్లుగా రియలైజ్ అయింది. అయితే రియలైజేషన్ కోలీవుడ్, బాలీవుడ్ కే పరిమితమా? టాలీవుడ్ లోనూ అనుసరిస్తుందా? అన్నదే టాపిక్ ఇక్కడ. ఆ మధ్య తెలుగులో ఓ స్టార్ హీరోతో ఓ భారీ బడ్జెట్ సినిమా చేసింది. చిత్రీకరణ మొదలైన దగ్గర నుంచే యూనిట్ తో వివాదాలు మొదలయ్యాయి. కమిట్ అయింది కాబట్టి ఆ సినిమా పూర్తిచేసింది. ప్రచారం మొదలయ్యే సరికి మళ్లీ ఆ చిత్ర నిర్మాతలు, హీరోని ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేసినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. ప్రచారానికి సరిగ్గా సహకరిచకుండా ఇబ్బంది పెడుతుందనే అంశం తెరపైకి వచ్చింది. అయితే అదంతా మౌనంగా.. రసహ్యంగానే నడిచిది తప్ప తనకు తానుగా బహిర్గతం కాలేదు. ఈ విషయంలో బుట్ట బొమ్మను మెచ్చుకోవాల్సిందే. మనసులో ఉద్దేశం ఎలాంటిదైనా? ఓపెన్ అవ్వలేదు. మరి ఇలాంటి విషయాల పట్ల అమ్మడిలో రియలై జేషన్ కలిగిందా? లేదా? అన్నది తేలాలి. తప్ప ఎవరిది? అన్నది పక్కన బెడితే? తన వైపు నుంచి సినిమాకు ఎంత వరకూ న్యాయం జరిగిందన్నది ఓపెన్ అయితే ఇబ్బందే ముంది. అదే చేయగల్గితే మళ్లీ తెలుగులోనూ అవకాశాలు వచ్చే అవకాశం ఉంది. ఆ కారణంగానే టాలీవుడ్ లో ఛాన్సులు రాలేదు అనే అపవాద నుంచి బయట పడే అవకాశం ఉంటుంది.



# చీరలో నభా వయ్యారాలు..

ట్రెడిషనల్ లుక్‌లో నభా నటేశ్ మెరిసిపోయింది. సోషల్ మీడియాలో షేర్ చేసిన లేటెస్ట్ ఫొటోషూట్‌లో ఆమె బంగారు రంగు చీర, ఎర్ర మెరూన్ బ్లౌజ్‌తో చక్కగా అలరిస్తోంది. అరుణోదయ కాంతుల్లో సన్నివేశాలుగా కనిపించే ఈ ఫొటోలు ఇప్పుడు అభిమానుల మనసులను గెలుచుకుంటున్నాయి. రెట్రో టచ్‌తో మిళితమైన ఈ లుక్‌తో నభా అందాలను కొత్తగా ఆవిష్కరించింది. ఓ గది మూలలో కూర్చుని పుస్తకం చదివే ఫోటో, మరోక ఫోటోలో బెడ్ పక్కన మెల్లగా తలవంచిన స్టైల్... ఇలా ప్రతి క్షణాన్ని ఒక సంగీత తరంగంలా రూపొందించింది నభా. ఈ ఫొటోలు ఫోటోగ్రాఫీ పరంగానూ, స్టైలింగ్ పరంగానూ కొత్తగా అనిపిస్తున్నాయి. అంతేకాదు, ఈ లుక్‌కి బ్యాగ్‌గ్రౌండ్‌లో ప్లే అయిన ఏఆర్ రెహ్మాన్ సంగీతం కలవలిసి మరింత మాయాజాలంగా చేసింది. నభా నటేశ్ తెలుగులో 'ఇస్మార్ట్ శంకర్' సినిమాతో హిట్ అందుకున్నా, ఆ తరువాత వరుస విజయాల్ని అందుకోలేకపోయింది. ఒకింత గ్యాప్ తర్వాత మళ్లీ 'స్వయంభు' సినిమాతో రీ ఎంట్రీ ఇస్తోంది. 'స్వయంభు'లో నిఖిల్ సరసన యాక్షన్ పీరియాడిక్ డ్రామాలో కనిపించనుంది. ఇక 'డార్లింగ్' మూవీకి సంబంధించి ఇప్పటికే గ్లామర్ షాట్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. నభా నటేశ్ నటనపై నమ్మకంతో పాటు, తన ఫిజికల్ లుక్స్‌పైన కూడా బాగా ఫోకస్ పెట్టింది. రెగ్యులర్‌గా జిమ్ చేస్తూ తన ఫిట్‌నెస్‌ను మెయింటైన్ చేస్తోంది. అదే సమయంలో ఫోటోషూట్ల ద్వారా సోషల్ మీడియాలో ఆకర్షణీయమైన ముద్ర వేసుకుంటోంది. తాజాగా వచ్చిన ఈ ట్రెడిషనల్ సిరీస్ కూడా ఆమె ఇమేజ్‌కి కొత్త అర్థం చేకూర్చేలా మారింది. ఈ ఫోటోలపై అభిమానుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. ట్రెడిషనల్ లుక్స్‌లోనూ ఎంత అందంగా కనిపించవచ్చో నభా మరోసారి నిరూపించిందంటూ, అభిమానుల నుంచి మెచ్చుకునే కామెంట్స్ వినిపిస్తున్నాయి.

# కన్నప్ప డైరెక్టర్ని పట్టుకుంది పెద్దాయనా!



మంచు విష్ణు కథానాయకుడిగా నటించిన `కన్నప్ప` రిలీజ్ కు రెడీ అవుతోంది. ఇటీవలే గుంటూరులో గ్రాండ్ గా ఈవెంట్ కూడా నిర్వహించారు. ప్రభాస్, మోహన్ లాల్, అక్షయ్ కుమార్, మోహన్ బాబు లాంటి స్టార్లతో భారీ కాన్వాస్ పై తెరకెక్కిన చిత్రమిది. మోహన్ బాబు ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. మంచు ఫ్యామిలీకి ఈ సినిమా ఓడ్రీమ్ ప్రాజెక్ట్ . ఈ సినిమా కోసం స్వయంగా విష్ణు కలం పట్టాడు. తానే కర్త, కర్మ, క్రియగా పని చేసాడు. సినిమాలో కొన్ని సన్నివేశాల్ని కూడా తానే స్వయంగా డైరెక్ట్ చేసినట్లు రివీల్ చేసాడు. ఈ సినిమాతో ముఖేష్ కుమార్ సింగ్ దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. అయితే ఇతను ఎవరు? అన్నది ఎవరికీ తెలియదు. ఈ ప్రాజెక్ట్ కు సంబంధించి పనులన్నింటిని విష్ణు చూసుకున్నాడు. దీంతో డైరెక్టర్ ఎంపిక కూడా అతడి చేతలు మీదుగా జరిగిందనుకున్నారంతా. కానీ ఆ ఛాన్స్ విష్ణు తీసుకోలేదు. నిర్మాతగా వ్యవహరించిన మోహన్ బాబు తీసుకున్నట్లు గుంటూరు ఈవెంట్లో ఆయనే స్వయంగా రివీల్ చేసారు. ముఖేష్ కుమార్ సింగ్ ని డైరెక్టర్ గా తీసుకుందామని విష్ణుకు చెబితే తండ్రి మాటకు కట్టుబడి అతడు ఎవరు? ఏంటి? అనుభవం ఇలాంటి ఏ విషయాలు కూడా విష్ణు అడగకుండానే తాను రాసిన కథను ముఖేష్ కుమార్ సింగ్ చేతుల్లో పెట్టినట్లు మోహన్ బాబు ఓపెన్ అయ్యారు.ఓపెద్ద ప్రాజెక్ట్ ను మోహన్ బాబు చేతుల్లో పెట్టారంటే ఆయన అన్ని రకాలుగా ముఖేష్ ని పరీక్షించే ఉంటారు. నటుడిగా మోహన్ బాబుది ఐదు దశాబ్దాల సుదీర్ఘ ప్రస్తానం. ఎన్నో సినిమాల్లో న టించారు. మరెన్నో వైవిధ్యమైన పాత్రలతో డైలాగ్ కింగ్ గా ఫేమస్ అయ్యారు. నిర్మాతగానూ ఎన్నో సినిమాలు నిర్మించారు. ఆ అనుభవాన్నంతటిని రంగరించి ఎంతో నమ్మకంతో ముఖేష్ కుమార్ సింగ్ ని డైరెక్టర్ గా ఎంపిక చేసారు. మరి మంచు ఫ్యామిలీ డ్రీమ్ ప్రాజెక్ట్ ను ముఖేష్ ఎంత అద్భుతంగా తీసాడో తెలియా లంటే జూన్ 27 వరకూ వెయిట్ చేయాల్సిందే. పాన్ ఇండియాలో ఈ చిత్రం రిలీజ్ అవుతుంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.